2015 ఏప్రిల్

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**



**చందా వివరములు :**

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-



**మా చిరునామా :**

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416


## లోపలి పేజీల్లో...


సంపాదకీయం ... 02
ఎడిటర్

అపొస్తలుడు — కొడవటికంటి ... 03

లియో టాల్‌స్టాయ్ — ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ ... 06

సాలెగూడు — మామయ్య కథలు ... 09
ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్

బైబిలు చరిత్ర — ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ ... 11

కనాను దేశపు స్త్రీ ... 14
శ్రీమతి కె. రేచల్ జోసఫ్

దేవుడు పండుగల ద్వారా మాట్లాడును ... 15
బ్రదర్ కె. సామ్రాట్‌గారు

పునరుత్థానము ... 18
రెవ. డా॥ కొడవటికంటి విక్రాంత్

పరిశుద్ధగ్రంథమునందలి దంపతుల పేర్లు ... 21
శ్రీమతి రిబ్కా విక్రాంత్

అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ ... 24
శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు


India Evangelistic & Relief Fellow-ship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియపాఠకులకు ఈస్టర్ శుభాకాంక్షలు.

ఈ మాసపత్రికను మీరు ఆదరిస్తున్న విధానాన్నిబట్టి మీకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. పత్రికలో కొద్దిగ మార్పులు చేర్పులు జరుగుచున్నవి, ప్రోత్సహించండి. చాలామంది క్రమము తప్పకుండా చందాలు పంపు తున్నారు చాలా సంతోషం. అయితే కొంతమంది అసలు చందా పంపుట లేదు. అటువంటి వారు దయచేసి ఈ పత్రికను ప్రోత్సహించుటకు చందాలు పంపించండి. మీరు చందా పంపకపోవడం వలన పత్రిక ప్రచురణకు చాలా దెబ్బతీస్తుందని తెలుసుకోవలసిందిగా మనవి. మీ స్నేహితులకు బంధువులకు ఈ పత్రిక పంపవలసిందని కోరితే వారి అడ్రస్‌లు పంపించండి.

మార్చి నెలలో ప్రచురించిన "The day of Redemption" అనగా యేసు సిలువ వేయబడిన రోజు శుక్రవారం కాదు, బుధవారం అని ప్రచురించడం జరిగింది. అదే "సత్యము". కాని ప్రభువు మూడవ దినమందు లేచెనని బైబిల్‌లో వున్నదికదా అని కొంతమంది ప్రశ్నించారు. అయితే యూదులు మూడు దినము లైన తరువాత జరిగిన సంగతులను మూడవ దినమందు అని చెప్పడం వారి వాడుక. అలా బైబిల్‌లో అనేక చోట్ల వ్రాయబడి వున్నది. ఉదా: ఎస్తేరు మూడు దినములు ఉపవాసము ఉండెదనని మొర్దెకైతో చెప్పినది. దినము అంటే ఒక రాత్రి ఒక పగలు "ఎస్తేరు 4:16". ఆ తరువాత ఎస్తేరు 5:1లో ఎస్తేరు మూడు దినములు అయిన తరువాత కూడా మూడవ దినమందు ఎస్తేరు రాజును దర్శించినట్టుగా వ్రాయబడివుంది.

అసలు యేసు ప్రభువు మూడు రాత్రుళ్ళు మూడు పగళ్ళు అని చెప్పిన తరువాత మన తప్పలను కప్పిపుచ్చడానికి దేవుని మాటలను మనము మార్చకూడదు. అది ఘోరమైన పాపము కనుక యేసు మరణించింది బుధవారమే. మూడు రాత్రుళ్ళు మూడు పగళ్ళు భూగర్భంలో వున్న మాట కూడ వాస్తవమే.

ఈ పత్రిక కొరకు ప్రార్థించండి, మా పరిచర్య కొరకు ప్రార్థించండి. దేవుడు మిమ్మును దీవించును గాక!!....

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

13

**- కొడవటికంటి**

"రాత్రి బాగా నిద్రపోయావా?" అని అంటూ "ఇక మీదట విద్యార్థుల బసలో నుండి కార్యాలయం వెనుక ఉన్న ఇంటిలో నీకు బస ఏర్పాటు చేసాను. తీమోను నీకు సహ కారిగా ఇవ్వబడ్డాడు" అని అంటూ "నిన్న కయపగారితో ఏమి మాట్లడావు?" అని అడిగాడు.

సౌలుకు ఏమి చెప్పాలో అర్థం కాలేదు. మౌనంగా ఉండిపోయాడు. గమలియేలు మళ్ళీ కల్పించుకొని "యెరూష లేములో వచ్చిన మార్పును గురించి అంతగా ఆలోచించవద్దు. యెరూషలేము పట్టణం ఎల్లప్పుడూ ఇలాగే ఉంటుంది. మారుతూ ఉంటుంది. అంతమాత్రం చేత ఏ మార్పు అయినా శాశ్వతం అని ఆలోచించుకోకూడదు" అన్నాడు.

సౌలు ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"నజరేయుడైన యేసును గూర్చిన వార్త ఇప్పుడు యెరూష లేము పట్టణం చుట్టుముట్టియున్నది. ఆ విషయం నీకేకాదు, ఏయూదునికైనా గుండెకోతగానే ఉంటుంది. అయితే యేసు శిష్యులందరు యూదులే! కొందరు యాజకులు కూడ శిష్యుల య్యారు. సన్‌హెడ్రిన్ సభికులు ఇంక ఆ వివరాలన్ని ఈ పాటికి నీవు తెలుసుకొని ఉంటావు" అన్నారు గమలియేలు.

"మీరు చెప్పినట్లుగా ఈ అలజడి యెరూషలేముకు మాత్రం పరిమితమైతే, నేనైనా, మరి ఎవరైనా బాధపడ నవసరం లేకపోవచ్చును. కాని నేడు పెంతెకోస్తు పండుగకు సర్వదేశాల నుండి వచ్చిన సర్వమానవులు ఈ వార్తను వారివారి దేశాలకు తీసుకొని వెళ్తారు. అప్పుడు అన్ని దేశాలలో ఈ మతభ్రష్టత్వం అలుముకొంటుంది" అంటూ కోపంమాత్రం దిగమింగుతూ దుఃఖాన్ని మాత్రం బయటకు రానిచ్చాడు.

గమలియేలుగారు చిన్నగా మందహాసం చేసాడు. సౌలు చెప్పిన విషయాలను ఆలోచిస్తున్నట్లుగా ఆయన ముఖ కవళికలు కనిపించినా, ఇంతకముందే ఆయన ఈ విషయా లన్ని ఆలోచించి ఒక అవగాహన కలిగి ఉన్నాడు.

"మానవుల కార్యాలన్ని తన ఆధీనంలో ఉంచుకొనిన ప్రభువు ఈ విషయంలో కూడ ఆయన నిర్ణయం తగిన సమయంలో తీసుకొంటాడు. మన జ్ఞానముతో తొందరపడి నిర్ణయం తీసుకొని, ఒక్కోసారి దేవుని చిత్తానికి వ్యతిరేకంగా పనిచేసినందువలన మనం అవమానాలపాలు కావలసి వస్తుంది కదా!" అన్నాడు.

"ఈ అభిప్రాయంతో దేవుడు మనకు అప్పగించిన పనిని మనం నెరవేర్చుకోకుండా ఆగిపోతామేమో!?" అన్నాడు సౌలు. 'తన అభిప్రాయం అనకుండా తన సందేహం' అన్నట్లుగా చిన్నగా అన్నాడు.

"దేవుడు మనకు నిర్దేశించిన పని చేస్తున్నప్పుడు మన మనస్సు సంతోషంగా ఉంటుంది. దేవుని చిత్తమునకు విరో ధంగా చేసే ప్రతి పని మనసులో సంతోషం లేకుండా చేస్తుంది. దేవుడు చెప్పిన పని పూర్తి చేసిన తర్వాత సంతృప్తి ఉంటుంది. మన ఇష్టం నెరవేర్చేటప్పుడు ఎంతచేసినా తృప్తి కలుగదు. పైగా కోపం, ద్వేషం, అసహనం మనల్ని వెంటాడి శారీర కంగా, మానసికంగా క్రుంగచేస్తాయి" అన్నారు గమలియేలు.

"అటువంటప్పుడు దేవునిచిత్తం మనం ఎలా తెలుసు కొంటాము?" అన్నాడు సౌలు.

"దేవుని చిత్తం మనకి నిర్ధారణగా తెలియపరచబడేంత వరకు మౌనంగా యుండటమే!" అన్నారు గమలియేలు.

"ఎంతకాలం వేచియుండాలి?" అన్నాడు సౌలు.

"కొలత లేదు. కాలం, సమయం మనవి కావు. అవి దేవునికి సంబంధించినవి. ఆయన సమయం ఆయన ఇష్టం. మనం నమ్మకమైన పనివాళ్ళముగా ఉంటే చాలు. మనం చెప్పిన పని చేస్తున్న వాళ్ళకంటే, మన ఇష్టానికి లోబడి మనం చెప్పే వరకు మన యెదుట మౌనియై యున్న వానిమీద మనకు ఎంత ప్రేమ ఉంటుంది?" అన్నారు గమలియేలు.

"యెహోవా కొరకు మహా రోషము కలిగిన ఏలియా గారు కర్మేలు కొండమీద చేసిన క్రియ దేవుని చిత్తమే కదా....!?" అడిగాడు సౌలు.

"ఏలియాగారి సేవ అంతటితో ఆపివేసి 'నీకు మారుగా ప్రవక్తయై యుండుటకు అబేల్మెహోలారాడైన పాషాతు కుమారుడైన ఎలీషాకు అభిషేకము చెయ్యమని' చెప్పబడింది."

గమలియేలు ఆగారు. తన మాటలు సౌలుకు రుచించ లేదు అని తెలుస్తుంది.

"ఇప్పుడు మీరు మహాసభ సభ్యులు" అంటుంటే సౌలు చటుక్కున తలపైకెత్తి గమలియేలుని చూసాడు. ఆయన మామూలుగానే మాట్లడుతున్నాడు. సన్‌హెడ్రిన్ సభ్యులు అని చెప్పటానికి నువ్వు అని అనకుండా 'మీరు' అని తనని సంబోధించడం సౌలుకు కొత్తగా ఉంది.

"సభలో తీసుకొన్న నిర్ణయాలు అన్నీ దైవాజ్ఞగానే చూడాలి. కాని ఇప్పుడు సభ – ఎవరో కొద్దిమంది మనోభీష్టం నెరవేర్పుకు పట్టుకొమ్మ అయింది. మనమందరము మన క్రియలకు, సభ నిర్ణయాల అమలుకు దేవునియెదుట బాధ్యుల మని మరచిపోకూడదు" అని ఇంక మాట్లాడవలసింది ఏమి లేదన్నట్లుగా ఆపివేశాడు. తర్వాత "మీ భార్యని తీసుకొని వస్తారా?" అని అడిగాడు గమలియేలు.

"అసలు ఆ విషయం ఆలోచించలేదండి. ఇప్పట్లో ఆమె అవసరం ఇక్కడికంటే అక్కడ తార్సులోనే ఎక్కువ ఉన్నది. ఇంతకు ముందులా మా అమ్మ అన్ని పనులు చూడలేక పోతుంది. అంతేకాక..." అని ఆగిపోయాడు.

కొంతసేపటికి 'ఇక ఈ రోజుకు ఇది చాలని' అన్నట్లుగా చూసి సౌలు లేచి నిలుచున్నాడు.

"తీమోనును పిలిచి మీ బస తయారు చెయ్యమని చెప్పండి?" అన్నాడు గమలియేలు. సౌలు నమస్కారము చేసి బయటకు వచ్చాడు. తీమోను కార్యాలయం ప్రక్కనే వున్న ఇంటిని శుభ్రం చేస్తూ కనిపించాడు. సౌలు ఏమి మాట్లడ కుండా బయట ఉన్న మండపం వద్దకు వచ్చేటప్పటికి అక్కడ జనం ఇంకా గుమిగూడి తగవులాడు కొంటున్నట్లుగా మాట్లా డుకుంటున్నారు.

సౌలు ఆ గుంపు దగ్గర ఆగకుండా వెళ్ళిపోవాలను కున్నాడు. ఆ గుంపు దాటి పోతుంటే – యేసు, నజరేతు ప్రవక్త, ఇటువంటి మాటలు వినబడ్డాయి.

ఎడమ ప్రక్కగా తిరిగి సొలొమోను మండపం మీదుగా ప్రధాన యాజకుని ఇంటదగ్గరికి వెళ్దాము అనుకున్నాడు. తను ఈ మహాపట్టణానికి ఇంత దూరం ప్రయాణంచేసిన పని పూర్తయిపోయింది.

ఇక తను తన దేశము వెళ్ళిపోవచ్చును. ఆ సంగతి ప్రధానయాజకునితో చర్చించి తను రబ్బీగా పట్టాపొందిన కాగితాలు తీసుకోవాలి. ఈ పట్టణంలో ఈ అలజడి తగ్గి పోయిన తర్వాత యెరూషలేము రావచ్చును గమలియేలు తనని శాశ్వతంగా యెరూషలేము వాసిగా చెయ్యాలని ఉన్నాడు.

ఇంత వయసు వచ్చిన తర్వాత, తన జీవితంలో తాను కోరుకొన్నవి పొందిన తర్వాత, తన ఉనికిని గురించి ఆలోచిం చాల్సి వచ్చింది. యేసు అనే నామం లేకుంటే ఈ పరస్థితి ఉండేది కాదు అనుకుంటూ నడుస్తున్నాడు.

ప్రధానయాజకుడు కయపకి సొంత నిర్ణయాలు ఏమి ఉండవు. కయపకే కాదు, కయప ఇంటిలో కాని, అతని అయిదుగురు బావ మరదులు అంటే అన్నా కుమారులకు గాని, సొంత ఆలోచన ఉండదు. అన్నా ఆలోచనే అందరి మనస్సులలో.

గమలియేలు దగ్గర కూర్చున్నందువలన తన హృదయం లోని అలజడి ఏ మాత్రము తగ్గకపోగా ఇంకా ఎక్కువ అయినట్లుగా ఉంది. ఈ హృదయవేదనని తప్పించుకొని ఎక్కడికి వెళ్ళాలి? ఎవరు దీనికి కర్త? తనొక్కనికే కాదు – దేవుణ్ని హృదయ పూర్వకంగా ప్రేమించి జీవిస్తున్న ఏ యూదునికయినా ఇది కడుపుకోత. ఇంతకాలం దేవుని రూపంలో ధ్యానించాము, ప్రేమించాము. ఈ ఆలయం, ఈ పట్టణం దీని సంరక్షణ కొరకు ఎన్ని లక్షలమంది తమ ప్రాణాలను ప్రేమగా త్యాగం చేసారు?

ఆదివారం నుండి శుక్రవారం వరుక కత్తిపట్టి యూద్ధము చేసిన యూదాయోధులు శుక్రవారం అస్తమయం కాగానే చేతిలో కత్తులు పారవేసి దేవాలయపు మండపాలలో శత్రువుల కత్తులకు బలి అయ్యారు. సబ్బాతును ఆచరించే కట్టుబాటు, దేవుని ఆజ్ఞకు లోబడి, తమ ప్రాణాల్ని ఏ మాత్రం

ప్రేమించలేదు – అది యూదా మతం. ఈ రోజు విద్యా హీనుడు, కనీసం యెరూషలేము నివాసి కూడా కాదు. పేరుకు పరిసయ్యునివలె కనిపించినా, అందులోని ఒక్క కట్టడ కూడా కనీసం వారానికి ఒక్కరోజైనా ఉపవాసం ఆచరించనివాడు, దశమభాగం ఇవ్వటానికి ఏ సంపాదన, ఆస్థిలేనివాడు, సీయోను కొండవంటి స్థిరపునాది కలిగిన ఈ యూదా మతాన్ని కదిలించటానికి, మార్చటానికి, మూలకారకుడయ్యాడు.

ఎదురుగా ప్రధాన యాజకుని నివాస ప్రాంగణం కనబడగా ఆలోచనలు ఆగిపోయినవి. యెరూషలేమును మాడ్చివేస్తున్న ఎండకంటే తన హృదయంలోని వేడి ఎక్కువగా ఉంది. ప్రధాన యాజకుడు దీనిని ఆర్పగలడా?

రాత్రి సన్‌హెద్రిన్ సభ్యునిగా, అన్నా ఆప్తునిగా కనబడిన సౌలును చూడగానే ప్రధాన ద్వారపాలకులు వంగి నమస్కారము చేశారు. కుడి ప్రక్కన ఉన్న అన్నా నివాసం వైపుకు చూస్తూ లోపలికి ప్రవేశిస్తున్న సౌలుకు, కయప ఎదురుగా వచ్చి సాదరంగా లోపలికి తీసుకొని వెళ్ళాడు.

'తను ఇక్కడకు రావటానికి ప్రత్యేకమయిన కారణం ఏమిటి? అనుకున్నాడు. తన నియమాక పత్రాల కోసమా? కాదు – మరి?

గమలియేలు మృదువైన మాటలు తన హృదయంలో అశాంతి రేకెత్తించినవే కాని నెమ్మది ఇవ్వలేదు. మార్గం, గమ్యం రెండూ తెలియవు.

కయపని చూసి చిన్నగా నవ్వాడు. తన ప్రధాన యాజకుని కనీస వందనం కూడ చెయ్యలేదని అప్పుడు గుర్తువచ్చింది. తను ఎందుకు ఇలా అయిపోయాడు?

సౌలు ముఖంలోని అసమాధానము విస్పుటముగా కనబడుతుంది. దానికి కారణం తనకు తెలుసు. కాని పూర్తిగా తన ఆధీనంలో సౌలును ఉంచుకోవటం సాధ్యమా? సౌలు సంగతి అంతా పూర్తిగా తెలుసుకొనిన తర్వాత 'సౌలు స్వరూపం బాహ్యం కంటే అంతర్గతమే గొప్పదని' అన్నా అనిన మాట గుర్తుకు వచ్చింది కయపగారికి.

రగులుతున్న అగ్నిపర్వతం ఎప్పుడో ఒకప్పుడు బద్దలుకాక తప్పదు. అది ఇప్పుడే అయితే! యుద్ధ ప్రారంభంలో అనుకోకుండా అందిన గొప్ప ఆయుధం – సౌలు. తనను వాడుకోవటం సాధ్యమా?

పనిమనిషి తెచ్చిన ద్రాక్ష పానీయం ఇద్దరూ పుచ్చుకున్నారు. చాలా విలువైనది అనుకున్నాడు సౌలు. నిన్నరాత్రి దీనియొక్క శక్తి రుచి చూచాడు. అందుకే గుర్రపు బగ్గీ ఎక్కవలసి వచ్చింది. అయినా మనసుకు ప్రశాంతత కలిగించింది. ఈ ప్రపంచమంతా నాకేమి? అన్నట్లుగా ఉంది.

"పరిశుద్ధాలయంలో యూదేతరుల ప్రవేశం నిషిద్ధం కాదా?" అన్నాడు సౌలు. లోపల అణచబడిన పొగ కొంచెం బయటకి చిమ్మబడినట్లుగా భావించాడు కయప. 'ఇంకా చాలా అణచిపెట్టబడి ఉంది' అనుకున్నాడు. "ఔను" అన్నాడు ఏమి తెలియనట్లుగానే.

"ఈ యేసు శిష్యులు యూదేతరులు కారా?" అన్నాడు సౌలు.

"కాదు. యేసు శిష్యులుగా చేరేవారు మొదట సున్నతి చేయబడాలి. వారు అర్పిస్తున్న అర్పణ, కానుకలు అన్నీ ఏమి మార్పులేదు. కాకపోతే యేసు ఇప్పుడో రేపో ఆకాశంలో కనబడి వీరందరినీ తనతో పైకి తీసుకొని వెళ్తాడని రాత్రింబవళ్ళు, ఎదురు చూస్తుంటారు" అన్నాడు కయప.

"ఇది ఇలా కొనసాగవలసిందేనా?" అడిగాడు సౌలు.

"నజరేయుడైన యేసు వీరికి నేర్పించిన బోధ కొత్త రకము – చచ్చిపోయి బ్రతుకు! అంటాడు. చచ్చిపోవటానికి సిద్ధంగా ఉన్నవాడిని దండిస్తే మార్పు వస్తుందా?" అన్నాడు కయప.

"యేసు..." అని ఆగాడు సౌలు. "ఈ నామమునే లేకుండా చెయ్యలేరా? మీ చేతిలో ఉన్న అధికారాలు మీకు సహాయం చెయ్యవా?" అన్నాడు.

**(సశేషం)**

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**

# ఫాదర్ సర్గీస్

## (లియో టాల్‌స్టాయ్)



పండుగ రోజులలో ఈ ఆశ్రమానికి చాలామంది భక్తులు వస్తుంటారు. సరదాగా కాలం గడిపేవారు, డబ్బున్న వారు కూడా వస్తారు. ప్రక్కనున్న గ్రామము నుండి ఒక ధనవంతుడైన ఆసామి, ఒక లాయరు, అతని భార్య, అతని మరదలు, అందమైన మరొకస్త్రీ ఆమె తన భర్తనుండి విడాకులు తీసుకున్నది. వీరంతా రెండు స్లెడ్జ్ బండ్లలో ప్రయాణం చేస్తూ తాగుతూ, స్వీట్లు తింటూ నవ్వుకుంటూ హుషారుగా ఉన్నారు. ఆ బండ్లను లాగే గుఱ్ఱాలు కూడా హుషారుగా ఉన్నాయి.

వాళ్ళు ఏడు మైళ్ళు ప్రయాణం చేసిన తర్వాత ఒకచోట ఆగారు. విడాకులు తీసుకొనిన అమ్మాయి – "ఈ రోడ్డు ఎటు పోతుంది?" అని అడిగింది.

"ఇక్కడినుండి ఎనిమిది మైళ్ళు దూరంలోనున్న టామోబ్రికి" అన్నాడు లాయరు.

"తర్వాత?" అన్నది ఆమె.

"ఫాదర్ స్టీఫెన్ దగ్గరికా?" అన్నది.

"ఔను" అన్నాడు.

"స్టీఫెన్ అందమైన సన్యాసి" అన్నది.

"ఔను" అన్నాడు.

"అట్లయితే మనం అక్కడికి వెళ్ళి ఏమైనా తిందాము" అన్నది.

"అట్లయితే ఈ రాత్రికి మనం ఇంటికి చేరలేము" అన్నాడు లాయరు.

"పరవాలేదు మనం అక్కడే ఉందాము ఈ రాత్రి" అన్నది.

"నేను యుద్ధములో ఉన్నప్పుడు దాని దగ్గరలో ఉన్న ఆశ్రమమును చూచాను" అన్నాడు.

"లేదు నేను ఈ రాత్రి స్టీఫెన్ దగ్గర ఉంటాను" అన్నది.

"అది అసాధ్యము. నువ్వెంత ప్రయత్నించినా ఆ పని నెరవేరదు" అన్నాడు లాయరు.

"అయితే నాతో పందెం పెట్టు" అన్నది.

"నువ్వే కాని ఒక రాత్రి అక్కడ గడిప గలిగితే నువ్వేమి అడిగితే అది ఇస్తాను" అన్నాడు లాయరు.

"నేను అంతే" అన్నది ఆమె.

"సరే పద" అన్నాడు లాయరు.

బండ్లు వేగంగా నడిపారు. బండి వేగం చూసి ఆమె ఆలోచించింది. ఇప్పుడు ఈ బండ్లు పడిపోతే ఈ చుట్టుప్రక్కల జనం ఎలా ప్రవర్తిస్తారు? అపాయం జరిగినా ఉపాయం తప్పక ఉంటుంది. స్టీఫెన్ భక్తిగలవాడే కావచ్చు. కాని నా అందం అతని మించింది అనుకుంటూ "స్టీఫెన్ గురించి విన్నాను. అతని వయస్సు ఎంత ఉంటుంది?" అన్నది పెద్దగా.

"ఏమో! నలభై ఉండవచ్చును" అన్నాడు లాయరు.

"ఆయన విజిటర్సుని ఆహ్వానిస్తాడా?" అన్నది.

ఆ అమ్మాయి ఆశ్రమం చూచింది. చుట్టూ అడవి. బండి ఆపమని క్రిందకు దిగింది. ఇక వారిని పొమ్మన్నది బండ్లు వెళ్ళిపోయాయి.

సర్గీస్ ఈ ఆశ్రమానికి వచ్చి ఆరుసంవత్సరాలైంది. ఇప్పుడు అతని వయస్సు నలభైతొమ్మిది. అతను మోకాళ్ళ మీద ఉన్నాడు. శరీరాశలను జయించడానికి ఎంతో శ్రమ పడాలి. ఇప్పుడు ఈ ఆశ్రమానికి తానొక్కడే గురి. తన జీవితమే ఇతరులకు ప్రసంగం కావాలి. శోధనలు అనేవి పరిశుద్ధులందరికి వచ్చాయి. చివరికి పరిశుద్ధుడైన ఆంటోనికి కూడా వచ్చాయి. ప్రభువా నువ్వెందుకు మనుష్యులను ఈవిధంగా సృజించావు? మానవజాతి ఈ శరీరాన్ని ఎలా జయిస్తుంది? నీరసపడిపోయాడు. నేను ఇతరులను మోస పుచ్చగలను. చెలరేగే ఈ కోరికలను నేనెలా ఎదుర్కోవాలి?

సిలువ గుర్తు చేతితో తన హృదయం మీద వేసుకున్నాడు. సువార్తను తీసుకొని చదువసాగాడు. కిటికి చెక్కలు కొట్టు కుంటున్నాయి. వాటిని చూసి నవ్వాడు. నిద్ర అనిపించింది. తలుపు మీద శబ్ధం అయింది. తను నిద్రపోతున్నాడా? మెళకువతో ఉన్నాడా? అనుకున్నాడు. మరలా తలుపు మీద శబ్ధంతో పాటు ఓ స్త్రీ గొంతు వినిపించింది. నేను పరిశుద్ధుల కథలు చాలా చదివాను. సాతాను అప్పుడప్పుడు స్త్రీ వేషములో వస్తుందని.

"అయ్యా! యేసు పేరున అడుగుతున్నాను తలుపు తీయండి" అనిన స్వరం.

"దేవా! సాతానును నువ్వే వెళ్ళగొట్టు" అని ప్రార్ధించాడు.

"అయ్యా! నేను సాతానును కాను. దారి తప్పిపోయిన అభాగ్యురాలను. నేను చలికి గడ్డకట్టుకొని పోతున్నాను." కొంచెం నవ్వు వినిపించింది. అతను అయిష్టంగానే లేచి తలుపు తీశాడు. చక్కని అమ్మాయి. ఇంతకు ముందెన్నడు ఆమెను చూడలేదు.

"నువ్వెవరు? ఎలా వచ్చావు?" అన్నాడు.

"దయచేసి తలుపు తీసి నన్ను లోనికి రానియ్యండి. నేను చచ్చిపోతున్నాను. నీవు నీ ఆత్మ రక్షణకొరకు ఒకనిండు ప్రాణాన్ని చలికి వదిలేస్తావా?" అన్నది.

అతను కోపంగా తలుపులాగాడు. ఆమె లోనికి వచ్చింది. ఇప్పుడు ఆమె పూర్తిగా తడిసిన దుస్తులలో అర్ధనగ్నంగా కనిపిస్తుంది. ఆమె నేరుగా తన గదిలోనికి వెళ్ళింది. అతను నిలుచుని ప్రార్ధన చేస్తున్నాడు.

"యేసు ప్రభువా! కాపాడు. నేను పాపిని" అంటూ వెళ్ళి తలుపును మూసి వచ్చాడు. నేలంతా ఆమె మీదనుండి వచ్చిన మంచుతో చల్లగా అయిపోయింది.

"మీరు నన్ను క్షమించాలి. మీ ఏకాంతానికి భంగము కలిగించాను" అన్నది. అయితే ఆ మాటలతో పాటు ఆమె నవ్వు కూడా అందంగా బయటకు వస్తుంది. "నేను దారితప్పి పోకపోతే ఇక్కడికి వచ్చేదానను కాను." ఆమె అబద్ధం చెబు తుందని స్టీఫెన్‌కి తెలుసు. అతను కండ్లు పైకి లేపి "సరే! నువ్వు ఇక్కడ ఉండు నేను అటు వెళ్తాను" అని దీపం తీసుకొని ప్రక్కగదిలోకి వెళ్ళి దారికి అడ్డంగా ఏదో పెట్టాడు.

"ఫాదర్ సర్గీస్, ఫాదర్ సర్గీస్! మిమ్మల్ని ఏమని పిలవాలి?" అన్నది నవ్వుతు.

"నీకేమి కావాలి?" అన్నాడు.

"నేను పూర్తిగా తడిచిపోయాను. నా దుస్తులు తీసి ఆరవేస్తాను ఈ గదిలోనే" అంటూ వివస్త్రకావడం మొదలు పెట్టింది. మధ్యలో "దయచేసి ఇటురాకండి, నేను వస్త్రహీను రాలిని" అంటూ నవ్వింది. మళ్ళీ పెద్దగా నవ్వింది. ఆమె వాచ్ చూసింది. రెండు గంటలు ఇక గంటలో నా స్నేహితులు వస్తారు. ఈ లోపల పని ముగించాలి. ఇలా మౌనంగా ఉంటే ఎలా? అనుకున్నది.

"ఫాదర్ సర్గీస్! ఫాదర్ సర్గీస్!" అని అరిచింది. "నాకేమో అయింది. జ్వరము వచ్చింది. నా తల తిరుగుతుంది" అంటూ బల్లమీద కూర్చోబోయి నిజంగానే క్రింద పడిపోయింది. అప్పుడు పెద్దగా అరిచింది. "అయ్యో సహాయం చెయ్యండి" అన్నది.

"యేసుప్రభువా నాకు సహాయం చెయ్యి" అంటూ ప్రార్ధన చేస్తున్నాడు.

"మానవత్వం లేదా? నేను చచ్చిపోతున్నాను" అని మూలిగింది.

"అయ్యో ఎవరు రారా?" అని మూలిగింది.

"నేను వస్తున్నాను" అంటూ అతను లేచి ఈ గదిలోకి వచ్చాడు. అక్కడున్న కట్టెలు ఒక చేత్తో పట్టుకొని గొడ్డలి మరో చేత్తో పట్టుకొని ఆమె వైపు చూడకుండా ఎడమ చేతిలో ఎండుకర్ర పట్టుకొని నేలమీద పెట్టి కుడిచేత్తో గొడ్డలి ఎత్తి చెక్కని కొట్టాడు. కాని అతని ఎడమచేతి చిటికెనవేలు చేతినుండి విడిపోయి అతని పాదాల దగ్గర పడింది. విపరీతమైన నొప్పి, రక్తం చిమ్ముతుంది. ఎడమచేతిని నడుముకు వేసి రక్తం రాకుండా వత్తి పట్టుకొని ఆమె ఎదురుగా నిలబడి "నీకేమి కావాలి?" అన్నాడు.

వెంటనే ఆమె ఆశ్చర్యపోయి తన వస్త్రాన్ని లాగి కప్పుకొని "నేను బాధలో ఉన్నాను ఫాదర్ సర్గీస్" అన్నది.

"ప్రియ సహోదరి! నువ్వెందుకు నన్ను నాశనము

చెయ్యాలనుకున్నావు? ఇటువంటివి సంభవిస్తాయి కాని అవి ఎవరివలన వచ్చాయో వారికి శాపము. నువ్వు దేవుని క్షమాపణ అడుగు" అన్నాడు.

ఆమె అతని ముఖం చూసింది ఎడమచేతి నుండి నడుముకు ఒత్తి పట్టిన వద్దనుండి రక్తము కారుతుంది. దీపం చేత్తో పట్టుకొని అవతలికి వెళ్ళి తెగిపోయిన అతని చిటికెనవ్రేలు తీసుకొని వచ్చింది. ఆమె ముఖం అతని ముఖం వలె తెల్లగా పాలిపోయింది. అతను అవతల గదిలోకి వెళ్ళాడు. "నేనేవిధంగా నిష్కృతి పొందగలను?" అని ఏడ్చింది.

"నువ్వెళ్ళు" అన్నాడు.

"నీ చేతికి కట్టుకట్టనివ్వు" అన్నది.

"నువ్వెళ్ళిపో" అన్నాడు.

ఆమె లేచి దుస్తులు ధరించి తలుపు దగ్గరలో వచ్చేటప్పటకి స్లెడ్జి బండి శబ్దం వినిపించింది. "ఫాదర్ సర్గీస్ నన్ను క్షమించు" అన్నది.

"నువ్వెళ్ళిపో, దేవుడు క్షమిస్తాడు" అన్నాడు.

"ఫాదర్ సర్గీస్ నా జీవితాన్ని నేను మార్చుకుంటాను" అన్నది.

"నువ్వెళ్ళు" అన్నాడు.

"నన్ను క్షమించండి, మీ దీవెనలివ్వండి" అన్నది.

"తండ్రి కుమార పరిశుద్ధాత్మ పేర" అని అన్నాడు.

ఆమె బండిలో కూర్చున్నది. "ఎలా ఉన్నది? అని అడిగాడు లాయరు.

"నేను ఓడిపోయాను" అన్నది. ఒక సంవత్సరం తర్వాత ఆమె ఫాదర్ ఆర్సన్ అనే పూజారిచే నడవబడే కాన్వెంటులో టీచర్గా చేరింది.

ఫాదర్ సర్గీస్ జీవితం ఏకాంత సన్యాస జీవితం, అలా ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి. మొదట్లో తన దగ్గరికి వచ్చేవారు తెచ్చే పాలు, పంచదార, రొట్టె, దుస్తులు, తీసుకొనేవాడు. కాలం గడిచే కొలది ఇంకా కఠినమైన యోగి జీవితం గడపాలనుకొని ఇతరులు తెచ్చే వస్తువులన్ని తిరస్కరించసాగాడు. వారానికి ఒకసారి మాత్రం రొట్టె, కట్టెలు తీసుకొనేవాడు. ఎవరైనా ఇంకా ఏమైనా తెస్తే వాటిని బీదలకు ఇచ్చేవాడు. రోజంతా తన గుహలో ఒంటరిగా ఉండి ప్రార్ధన చేసుకొనేవాడు. తనను దర్శించే వారితో మాట్లాడుతుండే వాడు. అయితే రోజులు గడిచేకొలది తనతో మాట్లాడ వచ్చేవారి సంఖ్య పెరగసాగింది. అవసరమైనపుడు నీళ్ళు, కట్టెలు బయటకు వెళ్ళి తెచ్చుకునేవాడు. సంవత్సరములో మూడుసార్లు మాత్రమే చర్చికి వెళ్ళేవాడు.

విడాకులు తీసుకొనిన ఆమె ఫాదర్ సర్గీస్ ఆశ్రమానికి ఓ రాత్రి రావడం మరలా వెళ్ళిపోవడం తర్వాత ఆమె తన జీవిత గమనాన్ని మార్చుకొని కాన్వెంటులో చేరడం తొందరలోనే అందరికి తెలిసిపోయింది. అప్పటినుండి ఫాదర్ సర్గీస్ పేరు ప్రతిష్టలు పెరిగాయి. ఫాదర్ సర్గీస్ని చూడడానికి తండోపతండాలుగా జనం రాసాగారు. కొందరు సన్యాసులు అక్కడనే నివశించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అక్కడే ఓ చర్చి వెలిసింది. ఒక శరణాలయము తయారైనది. ఆయనను గురించిన కథలు వ్యాపించాయి. అనేకులు రోగులను తీసుకొని వచ్చి, వెళ్ళి ఫాదర్ సర్గీస్ ద్వారా స్వస్థత వచ్చిందని ప్రచారం చేశారు.

యోగిగా అతని జీవితంలో ఎనిమిదవ సంవత్సరములో ఒక స్వస్థత జరిగింది. పద్నాలుగు సంవత్సరాల ఓ బాలుడిని అతని తల్లి తీసుకొని వచ్చి ఆ బిడ్డ తలమీద సర్గీస్ చేతిని పెట్టమని అడిగింది. ఫాదర్ సర్గీస్ స్వస్థత అంటే స్వస్థపరిచే ప్రార్థన చెయ్యడం, రోగి తలపై చేతులు పెట్టడం పెద్ద పాపముగాను గర్వముగాను భావించేవాడు. అయినా ఆ బిడ్డ తల్లి అతనిని బ్రతిమలాడసాగింది.

"అందరిని స్వస్థపరిచే నీవు నాబిడ్డ తలమీద చెయ్యి వేయవు. యేసు నామమున నిన్ను అడుగుచున్నాను" అన్నది.

అందుకు ఆయన "దేవుడు మాత్రమే స్వస్థపరచగలడు" అన్నాడు. అయితే ఆమె సర్గీని యొక్క చెయ్యి తన బిడ్డ తల మీద ఒక్కసారి ఉంచమన్నది. అయితే ఫాదర్ సర్గీస్ మౌనంగా తన గుహలోనికి వెళ్ళిపోయాడు.

**(సశేషం)**

**చిన్నపిల్లల పేజి**

# సాలెగూడు




పిల్లలూ బాగున్నారా? ప్రతి నెలా పరిశుద్ధత మాసపత్రిక క్రమం తప్పకుండా చదువుతున్నారా? మీ కొరకు మంచి మంచి నీతి కథలు వ్రాయాలని ఎంతో ఆశపడుతున్నాడు. కానీ, అప్పుడప్పుడు పనుల వత్తిడి వలన వ్రాయలేకపోతున్నాను. మరి మీకు వేసవి సెలవులు దగ్గరపడుతున్నాయి కదా! ఈ సెలవల్లో ఏం చేయాలని నిర్ణయించుకున్నారు. చాలామంది బంధువుల ఇళ్ళకు వెళ్తారు కదా! అయినప్పటికీ మీరు దేవుని కొరకు ఏదైనా ఒక పని చేయాలని ఆశపడుతుంటే, మీరు బైబిలు పూర్తిగా చదవటానికి పూనుకోండి. దేవుడు మన కొరకు బైబిల్లో అనేక విషయాలు వ్రాయించాడు. అవేమిటో మనకు తెలియక దేవునికి దూరమైపోతున్నాము. కాబట్టి దేవున్ని గురించి తెలుసుకొని దేవున్ని దగ్గర్నుండి ఆశీర్వాదాలు పొందాలంటే మన బైబిలంతా పూర్తిగా చదవాలి. మరి మనం ఈ నెల కథలోకి వెళ్దాము.

స్కోటిష్ పునర్నిర్మాణం జరిగేటప్పుడు ఒక భయంకరమైన యుద్ధం. ఆ యుద్ధంలో ఒక యువ సైనికుడు. అతని సైన్యాన్ని శత్రుసైన్యం దాదాపు ఓడించింది. అతనికి అతని సైన్యంలోని వారికందిరికి అర్థం అయ్యింది వాళ్ళు మమ్మల్ని చాలా త్వరగా ఓడిస్తారని. అందుకని అందరు ప్రాణభయంతో పరుగెత్తటం మొదలు పెట్టారు. శత్రుసైన్యం వాళ్ళు వెంట పడటం మొదలు పెట్టారు. ఇంకా వాళ్ళకి భయపడి ఆ యవ్వనస్థుడైన సైనికుడు చాలా వేగంగా పరుగెడుతూ పరుగెడుతూ చాలా దూరం వచ్చేసాడు. ఒక నిమిషం అలా ఆగి వెనక్కి చూస్తే వీళ్ళ సైన్యం వాళ్ళు కూడా ఎవరు కనిపించనంత దూరంగా వచ్చాడు.

అప్పుడు అతనికి ఒక గుహ కనిపించింది. అతని వెనకాల ఇంకా ఆ శత్రుసైన్యం వస్తుందని అర్థమైంది. ఇక పరుగెత్తలేక ఆ గుహలో దాక్కున్నాడు. అతను ఆ గుహలోకి వెళ్ళగానే ఆ చీకటిలో క్రింద పడిపోయి యేసుప్రభువుకి ప్రార్థన చేయటం మొదలుపెట్టాడు. అతను ఎంతో బాధతో కన్నీళ్ళకారుస్తూ యేసుప్రభుని అడుగు తున్నాడు. ప్రభువా నన్ను నా శత్రువులనుండి రక్షించు అని. అలాగే అతను దేవునితో ఒక ఒప్పందం చేసు కుంటాడు ఏమిటంటే నువ్వు నన్ను రక్షిస్తే నేను నా జీవితకాలమంతా నీ సేవకునిగా ఉంటాను అని యేసు ప్రభువుకి మాటిస్తాడు.

అప్పుడు అతను సహాయం కొరకు ఎదురుచూస్తూ ఉండగా. అతను ఉన్న గుహ ద్వారం దగ్గర ఒక సాలె పురుగు సాలె గూడు చేస్తూ కనిపించింది. అతను ఆ సాలె పురుగును చూస్తు అది ఎలా ఆ సన్నని తీగలను గుహ ద్వారం దగ్గర అటు ఇటు కడుతుందో అనుకున్నాడు. అప్పుడు అతను అనుకుంటాడు నేను యేసయ్యను నన్ను రక్షించమని అడిగితే ఆయన సాలె పురుగుని పంపించాడు ఏంటి. నన్ను ఈ చిన్న సాలె పురుగు ఎలా కాపాడుతుంది? అనుకున్నాడు. ఎప్పుడు ఆ శత్రువులు వచ్చి అతను దాక్కున్న స్థలం కనుక్కొని అతన్ని చంపేస్తారా అని అతను చాలా భయపడుతూ ఉన్నాడు.


తరువాత కొంచెంసేపటికి అతని శత్రువులు వచ్చినట్లుగా కొన్ని శబ్దాలు వినిపించాయి. వాళ్ళు అందరు చిన్నగా గమనిస్తున్నారు ఎవరైన ఎక్కడైన దాగివున్నారేమో నని. అందులో ఒకడు తుపాకి పట్టుకొని గుహ ఎదురుగా నిలబడడం ఇతను గమనించాడు. అతన్ని చూసి ఇంక ఈ యవ్వనస్తుడు ఆ చీకటిలో వంగి ఆఖరి నిమిషంలోనైన అతని ప్రాణాలు కాపాడుకోవాలి అని చూస్తున్నాడు. అది తలచుకుంటే అతని గుండె వేగంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.


అప్పుడు ఆ శత్రు సైనికుడు గుహలోనికి ప్రవేశించ బోగా ఆ సాలె గూడు అతనికి తగులుకుంది. అప్పుడు అతను వారి మిగిలిన సైనికులను పిలిచి ఇక్కడ ఎవరులేరు ఎందుకంటే ఎవరైన దీనిలోనికి వెళ్ళాలి అంటే ఈ సాలె గూడు తీసేసి వెళ్ళాలి. ఈ సాలె గూడు చెదిరిలేదు అంటే ఇక్కడ ఎవరు లేరు అని అన్నాడు.

చాలా సంవత్సరాలు గడిచిన తర్వాత ఈ యవ్వనస్తుడు ఏమైతే యేసుప్రభువుతో నిబంధన చేసుకుంటాడో అలాగే అతను పాస్టర్‌గా మారాడు.

అతను ఎప్పుడు ఒకటే చెప్తుంటాడు: ఎక్కడైతే యేసుప్రభువు ఉంటాడో అక్కడ సాలె గూడు కూడా ఒక గోడలా ఉంటుంది. ఎక్కడైతే యేసు ప్రభువు ఉండడో అక్కడ గోడ కూడా సాలెగూడులాగా ఉంటుంది.

మనం కూడా యేసుని మన జీవితంలోకి ఆహ్వానించుకోవాలి. అప్పుడు యేసు మనల్ని అన్నీ బాధల నుండి ఇబ్బందుల నుండి కష్టాల నుండి తప్పిస్తాడు.





# బైబిలు చరిత్ర

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

## బైబిల్ ఆవిర్భావం-దైవావేశమువలన కలిగినది

వేర్వేరు రచయితలు వ్రాసిన విభిన్న పుస్తకాలున్న బైబిలు ఒక చిన్న గ్రంథాలయంలాంటిది. వీరు సుమారు పదిహేను వందల సంవత్సరాల కాల వ్యవధిలో వేర్వేరు కాలాల్లో వేర్వేరు దేశాల్లో వేర్వేరు సంధర్భాల్లో జీవించారు. మానవజాతిపట్ల దేవుని సంకల్పం వెల్లడి కావడం వీరి రచనల్లో వున్న సాధారణాంశం. ఈ సంకల్పాన్నే హెబ్రీ పత్రిక రచయిత "పూర్వ కాలమందు నానాసమయములలోను నానావిధములుగాను ప్రవక్తలద్వారా మన పితరు లతో మాటలాడిన దేవుడు ఈ దినముల అంతమందు కుమారుని ద్వారా మనతో మాట లాడెను. ఆయన ఆ కుమారుని సమస్తమునకును వారసునిగా నియమించెను. ఆయన ద్వారా ప్రపంచములను నిర్మించెను" (హెబ్రీ 1:1,2) అని సంక్షిప్తంగా వివరించాడు. మానవజాతి దేవునితో పునఃరైక్యత పొందవలసిన అవసరతను, మానవులు సాటివారితో సామరస్యంగా వుండవలసిన అవసరతను చాలా స్పష్టంగా వివరించే బైబిలు మానవ జాతికి ఆయన అనుగ్రహించిన దివ్యసందేశం. యేసుక్రీస్తు ద్వారా పరిపూర్తి చేయబడిన రక్షణ ప్రణాళిక గురించి బైబిలు ఉద్ఘాటిస్తోంది. కాబట్టి అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రికలో "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుట కును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజన కరమైయున్నది" (2 తిమోతి 3:16-17) అని సంగ్రహంగా వివరించాడు. బైబిలు దివ్యప్రేరితమైన దేవుని వాక్యం.

## బైబిలు భాషలు

బైబిలు అరవైఆరు వేర్వేరు పుస్తకాల సమాహారం. బైబిల్లోని పాత నిబంధనలో (యూదు లేఖనాలు) ముప్పయి తొమ్మిది పుస్తకాలున్నాయి, మిగిలిన ఇరవై ఏడు పుస్తకాలు క్రొత్త నిబంధనలో వున్నాయి. హెబ్రీ, అరామాయిక్ (హెబ్రీ మాండలికం) మరియు గ్రీకు భాషల్లో ఏదో ఒక దానిలో ఈ పుస్తకాల రచన జరిగింది. ఏవో కొన్ని పుస్తక భాగాలైన ఎజ్రా 4:8-16,18 మరియు 7:12-26, యోబు 10:11, దానియేలు 2:4-7 వంటివి అరామాయిక్ భాషలో వ్రాయబడ్డాయి. పాత నిబంధనలోని మిగిలిన పుస్తకాలన్నీ హెబ్రీ భాషలో వ్రాయబడ్డాయి. యేసు కాలంలోను మరియు ఆదిసంఘం కాలంలోను ప్రధాన భాషగా వున్న గ్రీకు భాషలో క్రొత్త నిబంధన పుస్తకాల్ని వ్రాయడం జరిగింది.

## మౌఖిక సందేశం

దేవుడు హెబ్రీ జాతిపట్ల జరిగించిన యావత్కార్యాల్ని పాత నిబంధన వివరిస్తోంది. "మౌఖిక పారంపర్యం" అని నేడు మనం పిలుస్తున్న ప్రక్రియ చాలాకాలంగా హెబ్రీ ప్రజల చరిత్రకు సజీవరూపాన్నిచ్చింది. వర్ణనల ద్వారా మరియు పాటల ద్వారా వారి చరిత్ర ఒక తరంనుండి మరొక తరానికి అందించబడింది. ఈ విధంగా చరిత్ర ఒక తరం తర్వాత మరొక తరానికి అందడంలో మౌఖిక సందేశం ప్రముఖ పాత్ర పోషించింది. క్రొత్త నిబంధన తొలి రోజుల్లో అపొస్తలులు శిష్యులు యేసుక్రీస్తు గురించి తమ అనుభావాల్ని మౌఖిక సందేశాలద్వారా వివరించడాన్ని మనం గమనించగలం. క్రొత్త నిబంధనలోని సువార్తలు మొదట్లో మౌఖిక సందేశాలే.

## లిఖిత సందేశం

కాలక్రమంలో పశ్చిమాసియాలోని మానవ సమాజాలు అక్షరాల లిపిని రూపొందించాయి. అది సుమారు క్రీ.పూ. 1800 కాలం. నేర్చుకోడానికి మరియు ఉపయోగించడానికి ఈ లిపి సులువుగా వుండడంతో ప్రజలు చారిత్రక సంఘటనల వర్ణనల్ని పాటల్ని మరియు ప్రవచనాల్ని లిఖించడం

ప్రారంభించారు. తర్వాత ఇవే బైబిల్లో భాగమయ్యాయి. ప్రజలు వీటిని రెల్లు నుండి చేసిన పాపిరస్ అనే అట్టల మీద మరియు వెల్లమ్ అనే చదును చేసినట్టి ఎండిన జంతు చర్మాల మీద లిఖించారు. ఇవి చాలా పొడుగైనవి గనక వీటిని గుండ్రంగా చుట్టి భద్రపర్చేవారు. వీటిని "గ్రంథపు చుట్టలు" అని పిలిచేవారు. అయితే పాత నిబంధనలోని అన్ని పుస్తకాలు ఏకకాలంలో వ్రాయబడలేదు. ఈ పుస్తకాల్ని వ్రాయడానికి అనేక శతాబ్దాలు పట్టింది. ఒకసారి వీటిని వ్రాయడం ప్రారంభించిన తర్వాత, వాటి నకళ్లను మళ్లీ మళ్లీ వ్రాయవలసిన అవసరత ఏర్పడింది. కారణం, గ్రంథపు చుట్టల్ని విప్పి, చదివి, వాటిని చుట్టిపెట్టడంవలన అవి పాతబడిపోయి కొంతకాలానికి చదవడానికి ఉపయోగపడేవి కావు. లేఖనాల వ్రాతపతులకు నకళ్లు వ్రాసే వారిని "శాస్త్రులు" అని పిలిచేవారు. కొన్నిసార్లు శాస్త్రుల్లో ఎవరో ఒకరు బిగ్గరగా చదువుతుండగా అనేకమంది శాస్త్రులు నకళ్లు వ్రాసేవారు. పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన వ్రాతపతుల్లో అతి ప్రాచీనమైన కొన్ని నకళ్లు నేటికి భద్రంగా వున్నాయి. ఇవి యెరూషలేము, లండన్, పారిస్, డబ్లిన్, న్యూయార్క్, షికాగో, ఫిలడెల్ఫియ, యాన్‌యార్బర్, మిషిగాన్ నగరాల్లోని పురావస్తు ప్రదర్శన శాలలు మరియు గ్రంథాలయాల్లో వున్నాయి.

## యూదు లేఖనాల సేకరణ

పాత నిబంధనలోని వివిధ పుస్తకాలు ఏకగ్రంథంగా సేకరించబడక మునుపు చాలాకాలం అవి విడివిడిగానే వుండేవి. యోషీయా రాజు కాలంలో దేవాలయంలో ధర్మశాస్త్ర గ్రంథం దొరకడంతో (2దిన. 34:15) దివ్యావేశంవలన కలిగిన లేఖనాలకు ప్రాముఖ్యత ఏర్పడింది. అయితే వివిధ పుస్తకాల్ని సేకరించడం, మరియు వాటికి సరైన గుర్తింపు నివ్వడం యూదులు బబులోను చెర నుండి తిరిగి వచ్చిన తర్వాతనే జరిగింది. యూదు లేఖనాల్లోని పుస్తకాల్ని ఎప్పుడు తుదిరూపంలోనికి సంగ్రహపర్చారో ఖచ్చితంగా తెలుసుకోవడం సాధ్యం కాదు. యూదు లేఖనాల్లో కొన్ని క్రీస్తుపూర్వం 1300 నాటివి. అయితే వీటిని సంగ్రహపర్చి సమగ్రమైన రూపంలోకి తీసుకు రావడం సుమారుగా క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దంలో ప్రారంభమై వుండవచ్చు. సుమారుగా క్రీస్తుశకం 90 సంవత్సరంలో పాలస్తీనాకు చెందిన యూదులు జామ్నియాలో సమావేశమై హెబ్రీ లేఖనాల్లో ముప్పయి తొమ్మిది పుస్తకాలుండాలని సాధికారికంగా ఆమోదించారు. ఈ ముప్పయి తొమ్మిది పుస్తకాలే బైబిల్లోని పాత నిబంధన.

## క్రొత్త నిబంధన పుస్తకాలు

క్రీస్తుశకం మొదటి శతాబ్దంలోని క్రైస్తవులు ఆరాధనకు సమావేశమైనప్పుడు హెబ్రీ లేఖనాల నుండి కొన్ని భాగాలను చదివే వారు. ఇది యూదుల ఆచారం. యేసు గురించి ప్రత్యక్షంగా తెలిసినవారు ఆయన జీవితం గురించి మరియు ఆయన బోధల గురించి మాట్లాడేవారు. అయితే రెండవ తరం క్రైస్తవుల కొరకు మరియు భావితరాలకు లిఖిత పూర్వకమైన లేఖన ప్రతి అనివార్యమయ్యింది. అపొస్తలులు శిష్యులు సువార్తలను, తాము జరిగించిన కార్యాలను మరియు ఇతర పత్రికలను వ్రాయడం ప్రారంభించారు. రోమా సామ్రాజ్యంలో ప్రపంచభాషగా పేరొందిన గ్రీకు భాషలో క్రొత్త నిబంధనలోని పుస్తకాలను వ్రాయడం జరిగింది. వీటిని క్రీస్తుశకం 45-95 మధ్యకాలంలో వ్రాశారు. ఇవి ఒకరి దగ్గరనుండి మరొకరికి అందేవి, వీటిని ఏక పుస్తకంగానో లేక పత్రికగానో చదువుకొనేవారు. దాదాపుగా మూడు వందల సంవత్సరాలపాటు (క్రీస్తుశకం 100-400) ఆదిసంఘంలోని నాయకుల్లో క్రొత్త నిబంధన పుస్తకాల్లో ఏ యే వాటిని పవిత్ర లేఖనాలుగా గుర్తించి వాటికి హెబ్రీ లేఖనాల స్థాయినివ్వాలనే విషయం మీద తర్జనభర్జనలు జరిగేవి. క్రీస్తుశకం 367 సంవత్సరంలో అలెగ్జాంద్రియ బిషప్పుగా వున్న అతనేషియస్ ఇరవై ఏడు పుస్తకాల్ని పవిత్ర లేఖనాలుగా ప్రతిపాదిస్తూ క్రైస్తవులందరూ వీటిని ఆమోదించాలని ప్రకటన విడుదల చేశాడు. బిషప్ అతనేషియస్ ప్రతిపాదించిన ఇరవై ఏడు పుస్తకాలు అప్పటికే క్రైస్తవ సంఘాల్లో ప్రజాదరణపొంది వాడుకలో వున్న పుస్తకాలే. రోమ్ (క్రీ.శ.382), హిప్పో (క్రీ.శ.393), మరియు కార్తేజ్ (క్రీ.శ.397)లలో జరిగిన క్రైస్తవ సంఘ నాయకుల సమావేశాలు బిషప్ అతనేషియస్ నిర్ణయాన్ని ధృవీకరించాయి. ఈ ఇరవై యేడు పుస్తకాలనే నేడు మనం క్రొత్త నిబంధన అని పిలుస్తున్నాం.

## తెలుగు అనువాదాలు

యూరపు దేశాల నుండి వచ్చిన మిషనరీలు తెలుగు భాషలోనికి బైబిలును అనువదించడానికి ఉపక్రమించారు.

1727 సంవత్సరంలో బెంజమిన్ షుల్జ్ తెలుగు భాషలో క్రొత్త నిబంధన అనువాదాన్ని, 1732 సంవత్సరంలో పాత నిబంధన అనువాదాన్ని పూర్తి చేశాడు. 1805 సంవత్సరంలో సెరంపూరుకు చెందిన విలియమ్‌కేరీ మరియు అతని సహోద్యోగులు తెలుగు అనువాదాన్ని ప్రారంభించి 1811 సంవత్సరంలో క్రొత్త నిబంధనను పూర్తి చేశారు. అయితే ఈ అనువాద ప్రతి 1812 సంవత్సరంలో సంభవించిన పెను అగ్నిప్రమాదంలో అగ్నికి ఆహుతి అయ్యింది. మళ్లీ తెలుగు భాషలోనికి బైబిలు అనువాదం మొదలయ్యింది. 1818 సంవత్సరంలో తెలుగులో క్రొత్త నిబంధన ప్రచురణ జరిగింది. మూడు సంవత్సరాల తర్వాత పాత నిబంధనలోని అయిదు పుస్తకాల ప్రచురణ జరిగింది. ఆనందరాయుడు మరియు జాన్‌గోర్డన్‌ల సహకారంతో 1818 సంవత్సరంలో లండన్ మిషనరీ సొసైటీకి చెందిన మిషనరీ ఎడ్వర్డ్ ప్రిచ్చెట్ క్రొత్త నిబంధనను ప్రచురించాడు. 1854 సంవత్సరంలో పాత నిబంధన అచ్చయ్యింది. హే మరియు వార్డ్‌లా అనేవారు చౌదరి పురుషోత్తము అనే పండితుని సహకారంతో క్రొత్త నిబంధనను సవరించారు. 1860 సంవత్సరంలో బ్రిటిష్ అండ్ ఫారిన్ బైబిల్ సొసైటీ వారి మద్రాస్ ఆక్జిలరీ పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన వున్న పూర్తి బైబిలును ప్రచురించింది. తర్వాత తెలుగు బైబిలును పలుమార్లు సవరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రభాష అయిన తెలుగులో వివిధ మాండలికాలు వున్నందున తెలుగు బైబిలు అందరికీ ఆమోదయోగ్యంగా వుండేలాగా సవరణ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. సవరించిన ఈ ప్రతి 1911 సంవత్సరంలో ప్రచురించబడింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత రెవరెండ్ డాక్టర్ ఈ. ప్రకాశం ఆధ్వర్యంలో కొంతమంది పండితులు తెలుగు బైబిలును మరోసారి సవరించారు. 1953 సంవత్సరంలో తెలుగు బైబిలు తుది ప్రతి ప్రచురించబడింది.

## బైబిల్లోని వివిధ సాహిత్యరీతులు

ఒక్కొక్క సాహిత్యరీతిలో ఎన్నో గ్రంథాలుంటాయి. ఏదైనా ఒక ఉపకరణాన్ని ఎలా ఉపయోగించాలో తెలిపే నియమావళి ఆ ఉపకరణానికి సంబంధించిన సాంకేతిక భాషలో వుంటుంది. నవలలో కాల్పనిక వర్ణన వుంటుంది. పద్యంలో యతి ప్రాసలుంటాయి. ఏ నిబద్ధతకు లోబడని గేయాలు కూడ వుంటాయి. చరిత్ర గ్రంథాల్లో చారిత్రక సందర్భాల వివరణ కన్పిస్తుంది. గ్రంథం ఏ కోవకు చెందుతుందో అనే దాని మీద ఆ గ్రంథం రచనశైలి కూడ ఆధారపడి వుంటుంది. బైబిలు ఒక పెద్ద గ్రంథం. దీంట్లో వివిధ సాహిత్య శైలుల్లో రాసిన వివిధ రచనలు వున్నాయి. విభిన్న శైలుల్లో వున్న బైబిలు గ్రంథం పాఠకుల్లో మరింత ఉత్సుకతను కల్గించి వారికో సవాలుగా నిలుస్తుంది.

బైబిలును అధ్యయనం చేసేటప్పుడు ప్రతి పుస్తకాన్ని చదవడంతో బాటు ఆ పుస్తకం రచనాశైలిని కూడ పరికించడం చాలా ముఖ్యం. రచయిత ఉద్దేశాలను తెలుసుకోవడానికి రచనాశైలి ఉపకరిస్తుంది. ఉదా : 1సమూ. 1:1-28 చూడండి. ఈ వాక్యభాగాన్ని 1సమూ. 2:1-10 లోని వాక్యభాగంతో పోల్చి చూడండి. ఒకే పుస్తకంలో వేర్వేరు రచనాశైలులు కన్పిస్తాయి. మొదటి భాగం గద్యం (వచనం), రెండవ భాగం పద్యరూపంలో వున్న కీర్తన లేక ప్రార్థన. పాఠకులు పుస్తకం ఉద్దేశాన్ని గ్రహించడంలో ఈ మార్పు సహాయపడ్తుంది.

క్రొత్తనిబంధన నుంచి మరో క్లుప్తమైన ఉదాహరణ: యేసు జనన వృత్తాంతం. లూకా 2:1-21లో యేసు జననం గురించి ఎన్నో వివరాలు సంఘటనలు కన్పిస్తాయి. ఇందుకు భిన్నంగా యోహాను సువార్తలో యేసు జననం గురించి ఏ ప్రస్తావనా కన్పించదు. ప్రతిగా, యేసు వాక్యము అని, నిజమైన వెలుగు అని, ఆయన శరీరధారి అయ్యాడని సూచించే కావ్యవర్ణన కన్పిస్తుంది (1:1-14). యేసు ఎవరనే ఆలోచనలను ఈ వివిధ సాహిత్య రీతులు ఎలా ప్రభావితం చేస్తాయి? సువార్త రచయితలు తమ సువార్తల్లో యేసు జననం గురించి ఆయన మూర్తిమత్వం వ్యక్తిత్వం గురించి వివిధ అంశాలను ఎందుకు వక్కాణించారు? ఒక్కొక్క రచయిత తన ఉద్దేశాలను ఏ శైలిలో చెప్పాడనే సంగతి కూడ బైబిలు ఏం బోధిస్తుందో తెలుసుకోవడానికి క్రొత్త మార్గాలను చూపిస్తుంది.

**(సశేషం)**

# కనాను దేశపు స్త్రీ



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

యేసు అక్కడ నుండి బయలుదేరి తూరు సీదోనుల ప్రాంతములకు వెళ్ళగా ఇదిగో ఆ ప్రాంతముల నుండి కనాను స్త్రీ ఒకతె వచ్చి ప్రభువా దావీదు కుమారుడా నన్ను కరుణించుము, నా కుమార్తె దయ్యము పట్టి బహు బాధ పడుచున్నదని కేకలు వేసెను (మత్తయి 15:21-28) వరకు.

కనాను స్త్రీ భయంకరమైన విగ్రహారాధన, బొమ్మలకు బలి అర్పించిన జాతి నుండి వచ్చిన స్త్రీ. నిజదేవుడైన యేసయ్యను ఆశ్రయించి ఆయన చేత ప్రశంసించబడినది. ప్రభువు దగ్గరకు వచ్చి ఆయనచే మెప్పు పొందిన ఈ స్త్రీలోని కొన్ని మంచి సుగుణములను ధ్యానించుకొందాము.

**1. ఆయన ప్రభువని నమ్మినది :**

ప్రభువా దావీదు కుమారుడా నన్ను కరుణింపుము అని కేకలు వేసెను (మత్తయి 15:22). కుమార్తెకు దయ్యము పట్టినందున వచ్చిన స్త్రీ ఆయన ప్రభువని, తప్పకుండ ఆయన దయ్యమును వెళ్ళగొడ్తాడని నమ్మింది. ప్రభువు దగ్గరకు వచ్చి కేకలు పెడుతుంది. ఆయన కరుణ కొరకు ఎంతో ప్రాధేయ పడుతుంది. ఆయనను సంపూర్ణముగా విశ్వసించింది. ప్రభువు మీద పూర్తిగా ఆనుకున్నది. అందువలన యిప్పుడు ఆమె కుటుంబములో అద్భుతాన్ని చూడబోతుంది.

**2. పట్టుదల కలిగిన స్త్రీ :**

నా కుమార్తె దయ్యము పట్టి బహు బాధ పడుచున్నది అని కేకలు వేసెను. అందుకాయన ఆమెతో ఒక్కమాటయైనను చెప్పలేదు. ఈ దినాలలో చాలామంది దేవుని యొద్దకు వచ్చి ప్రభువా నాకు అది కావాలి యిది కావాలి అంటారు. సరిగా ఏది కావాలో అడగరు. విశ్వాస హృదయముతో నమ్మకముతో దేవుని అడగనందున ఏమియు పొందలేకపోవుచున్నారు. అయితే ఈ స్త్రీ పట్టుదల చూడండి. ఆమె కేకలు ప్రభువు విని ఒక్కమాటయైనను జవాబు చెప్పలేదు. అయితే ఈ స్త్రీ వెంబడి వెళ్లుచూ పట్టు విడువక కేకలు వేస్తుంది. ప్రభువు ఆమె విశ్వాసాన్ని ఆమెలో ఉన్న పట్టుదలను గమనిస్తున్నాడు.

ఆమె కేకలు వినిన శిష్యులు ప్రభువా ఈమె మన వెంట వచ్చుచున్నది. ఈమెను పంపివేయమని వేడుకొనిరి. అయితే ఆమె పట్టిన పట్టును విడిచిపెట్టలేదు. పట్టుదల కలిగినవారు ప్రభువు దీవెనలు సంపాదించుకొంటారు.

**3. దీన మనస్సు గల స్త్రీ :**

ఆమె వచ్చి ఆయనకు మ్రొక్కి ప్రభువా నాకు సహాయము చేయుమని అడిగెను. ఈమె ప్రభువు దగ్గరకు వచ్చి నాకు సహాయము చేయుమని చెప్పి ఆయన పాదముల మీద పడింది. ఇది ఆమెలోని దీనత్వమును విధేయతను చూపిస్తుంది. అయితే ప్రభువు "పిల్లల రొట్టె తీసికొని కుక్క పిల్లలకు వేయుట యుక్తము కాద"నెను. తమను కుక్కలతో పోల్చినందుకు బాధపడక తిరుగుబాటు చేయకుండా తగ్గించు కొనినది. ఈ స్త్రీ తన స్థితిని గ్రహించుకొని నిజమే ప్రభువా కుక్కపిల్లలు కూడ తన యజమానుని బల్లమీద పడు ముక్కలు తినును గదా అనెను. ఆమె బలమైన విశ్వాసము చూచిన ప్రభువు అమ్మా! నీ విశ్వాసము గొప్పది. నీవు కోరినట్టే నీకు అవును గాక అని ఆమెతో చెప్పెను. ఆ గడియలోనే ఆమె కుమార్తె స్వస్థత నొందెను. మత్తయి 15:28.

ప్రభువు దగ్గరకు అందరు వెళ్తారు. నేను వెళ్తాను. అన్నట్లు వెళ్తితే ఏమి ఫలితం ఉండదు. ప్రభువు దగ్గరకు వెళ్ళే మనిషికి ముందుగా బలమైన విశ్వాసం స్థిరమైన విశ్వాసం ఉండాలి. వినయ విధేయతలు తగ్గింపు జీవితం దీనమనస్సు కలిగియుండాలి. కనాను స్త్రీ ఈ విషయాలలో గట్టిగా నిలబడింది. కనుక నీవు కోరినట్లు గానే నీకు అవును గాక అని ప్రభువు ఆమెతో చెప్పినట్లుగానే ఆ గడియలోనే ఆమె కుమార్తె స్వస్థత నొందెను.

అమ్మా! నీ విశ్వాసము గొప్పది అని కొనియాడబడెను. గొప్ప విశ్వాసమే పట్టుదలకు నాంది. కనాను స్త్రీ వలె విశ్వాసముతో పట్టుదలతో దీనమనస్సుతో ఆయనను అడుగుదాము. దేవుడు మనకందరకు సహాయం చేస్తాడు.

# దేవుడు పండుగల ద్వారా మాట్లాడుతాడు



బ్రదర్ కె.సామ్రాట్

**గత సంచిక తరువాయి......**

**ప్రథమ ఫలముల పండుగ:**

ఈ పండుగలో ప్రజలు దేవుడు వారికిచ్చిన పైరు పంటను బట్టి, వారు కోసిన పంటను బట్టి దేవునికి కృతజ్ఞత చెల్లించేవారు. వారు ఇక్కడనుండి ఒకటి, అక్కడనుండి ఒక్కటి, ఆ విధముగా వెన్నులు తీసుకుని వాటిని ఒకగుచ్ఛగా జతపరచి దానిని యాజకుని యొద్దకు తీసుకుని రావాలి. యాజకుడు వెన్నులు తీసుకుని దేవుని యెదుట అర్పణగా అల్లాడించాలి. ఆదివారము అనగా సబ్బాతు దినమునకు మరుసటి దినమున ఈలాగు చేయాలని దేవుడు ఆజ్ఞాపించాడు. ఈ విధంగా అల్లాడించు అర్పణము యెహోవాకు అర్పించి ప్రాయశ్చిత్తము కొరకు ఆయన యొద్దకు వస్తాడు. ప్రజలు తెచ్చిన ధాన్యార్పణమును యాజకుడు దేవుని కర్పిస్తాడు. ఈ దహన బలి యొక్క సువాసన, పైకి వెళ్ళిన ధాన్యార్పణ దేవుని అంగీకారానికి సాదృశ్యాలుగా వున్నాయి. ప్రథమ ఫలముల పండుగ ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానమునకు సూచనగా వుంది. ఆయన చనిపోయి నిత్య జీవార్థమై తిరిగి లేచిన వారిలో ప్రథముడు. ఈ పండుగలో సూచించినట్లు ప్రభువైన యేసు క్రీస్తు వారి పునరుత్థానము ఆదివార దినమున జరిగింది. క్రీస్తు ప్రథమ ఫలమైనారు. మృతులలో నుండి లేచుటయు, నిత్యము దేవునితో జీవించు నిరీక్షణను ఈ పండుగ సూచిస్తుంది. ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానము మన నిరీక్షణను రూఢిపరుస్తుంది. పౌలు 1 కొరింథీ 15:20-23లో దీనిని వివరిస్తాడు. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారా మృతుల పునరుత్థానము కలిగెను. ఆదాము నందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రదికింపబడును ప్రథమ ఫలముక్రీస్తు తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రదికింపబడుదురు". పేతురు కూడా దీనిని వివరిస్తూ 1 పేతురు 1:3-4లో ఇలా వ్రాశాడు : "మన ప్రభువగు యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు స్తుతింపబడునుగాక. మృతులలోనుండి యేసుక్రీస్తు తిరిగి లేచుట వలన జీవముతో కూడిన నిరీక్షణ మనకు కలుగునట్లు, అనగా అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు కలుగునట్లు, ఆయన తన విశేష కనికరము చొప్పున మనలను మరల జన్మింప జేసెను".

యేసుక్రీస్తు ప్రథమ ఫలమైనప్పుడు ఆయనయందున్న వారందరునూ ఆయన వెంబడి దేవుని సన్నిధిలో ప్రవేశించి నిత్యమైన స్వాస్థ్యము పొందుటకు అర్హులు. క్రీస్తు ఈ లోకమునకు వచ్చినప్పుడు ఆయన తాను దేవుని అద్వితీయ కుమారునిగా ఉన్నట్లు ప్రకటించాడు. "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). కాని ఆయన మరణ, భూస్థాపన మరియు పునరుత్థానము తరువాత దేవుని అద్వితీయ కుమారుని హోదాను విడిచి పెట్టి అనేక మంది సహోదరులలో జ్యేష్ఠుడైనాడు. పౌలు ఈ విషయము రోమా 8:29లో వివరిస్తూ, "ఎందుకనగా తన కుమారుడు అనేక మంది

సహోదరులలో జ్యేష్ఠుడగునట్లు, దేవుడెవరిని ముందుగా ఎరిగెనో, వారు తన కుమారునితో సారుప్యము గలవారవుటకు వారిని ముందుగా నిర్ణయించెను" అని వ్రాసాడు. ఆయన పునరుత్థానము తరువాత మగ్దలేనె మరియను కలుసుకొని ఇలా మాట్లాడాడు: "నేను ఇంకను తండ్రియొద్దకు ఎక్కిపోలేదు గనుక నన్ను ముట్టుకొనవద్దు అయితే నా సహోదరుల యొద్దకు వెళ్ళి – నా తండ్రియు మీ తండ్రియు, నా దేవుడును మీ దేవుడైన వానియొద్దకు ఎక్కిపోవుచున్నానని వారితో చెప్పుమనెను" (యోహాను 20:17). యోహాను 17వ అధ్యాయంలో ఆయన తండ్రికి చేసిన ప్రార్థన ఏ విధముగా యేసు మనలను తండ్రితో ఐక్యపరచినాడో స్పష్టంగా చూపిస్తుంది "పరిశుద్ధమైనతండ్రీ మనము ఏకమైయున్నలాగున వారును ఏకమైయుండునట్లు నీవు నాకు అనుగ్రహించిన నీ నామమందు వారిని కాపాడుము" (11వ), "మనము ఏకమైయున్నలాగున వారును ఏకమైయుండవలెనని నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వారికిచ్చితిని" (22వ). దేవుడు ఆదియందే ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థాన దినము నియమించినాడు. అది అలాగే ఆదివారము జరిగింది. ప్రథమ ఫలముల పండుగద్వారా ఆ పునరుత్థాన ఆదివారమును దేవుడు తన బిడ్డలకు బయలు పరచాడు.

**పెంతెకొస్తు పండుగ :**

ఈ పెంతెకొస్తు పండుగ కొన్నిసార్లు "కోతపండుగ" అని పిలువబడుతుంది (నిర్గమ 23:16), "వారముల పండుగ" లేదా "గోధుమకోత ప్రథమఫలముల పండుగ" అని పిలువబడుతుంది. మేడ గదిలో ఉన్న శిష్యులపై పరిశుద్ధాత్మ దిగి వచ్చిన దానికి సూచనగా ఈ పండుగ ఆత్మల పంట గురించియైన ప్రవచనంగా వుంది (అపో.కా.2). ఈ పండుగలో ప్రజలు రెండు తాజా రొట్టెలను తెచ్చి యెహోవాకు ప్రథమ ఫలముగా, అల్లాడించు అర్పణముగా ఇచ్చెడివారు. ఈ అర్పణకై పులిసిన రొట్టె (పొంగు కలపిన రొట్టె) లను తీసుకుని రావలసి ఉంది. ఆదివారం చోటు చేసుకున్న ఈ ప్రథమఫలముల పండుగ ప్రభువైన యేసుక్రీస్తు పునరుత్థానాన్ని సూచిస్తుంది. పెంతెకొస్తు పండుగ, అపొస్తలులకార్యములు 2వ అధ్యాయంలో సంభవించిన సంఘటనలను సూచిస్తుంది. ఈ రెండు పండుగల మధ్యనవున్న వ్యవధి యాభైదినములు (ఏడు సబ్బాతులు ఒక దినము). పెంతెకొస్తు అనునది గ్రీకు పదము, అంటే యాభై అని అర్థం. ఆ దినమున పరిశుద్ధాత్మ అనేక వ్యక్తులపై దిగివచ్చిన విషయాన్ని పెంతెకొస్తు పండుగ, ఆ ఆత్మల పంటను, సూచిస్తుంది. "కాబట్టి అతని వాక్యమును అంగీకరించిన వారు బాప్తీస్మము పొందిరి, ఆ దినమున ఇంచు మించు మూడువేల మంది చేర్చబడిరి" (అపొ.కా. 2:41). ప్రభువైన యేసుక్రీస్తు ఆదివారదినము పునరుత్థానుడై ఈ భూమి మీద నలభైదినాలున్నారు. తరువాత ఆయన పరలోకమునకు ఆరోహణమాయెను. పునరుత్థాన ఆదివారము నుండి పెంతెకొస్తు దినము వరకు యాభైదినములు లేక ఆయన ఆరోహణుడైన (40వ) దినము నుండి పెంతెకొస్తు దినానికి పది దినములు. కాబట్టి ఆ దినమున పరిశుద్ధాత్మ దిగిరావటం, సంఘం ఏర్పడటం రెండు జరిగాయి. పెంతెకొస్తు దినమున మేడగదిలో వేచియున్న శిష్యులమీద పరిశుద్ధాత్మ కుమ్మరించబడటములో ఏ పొరపాటు లేదు. మత్తయి 16:18లో యేసుప్రభువు తన సంఘాన్ని కడతానని ప్రకటించాడు: "మరియు నీవు పేతురువు, ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను". ఆవిధంగా ఆ పెంతెకొస్తు పండుగ దినముననే యేసు సంఘాన్ని ప్రారంభించాడు. దేవుడు యూదులను, అన్యజనులను మరియు తప్పిపోయిన పాపులనందరిని అంగీకరిస్తున్నాడని రెండు పులిసినరొట్టెలు సూచిస్తాయి. యేసుప్రభువు లూకా 19:10లో ఈ విధముగా ప్రకటించాడు: "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను". పెంతెకొస్తు దినమున ప్రారంభింపబడిన సంఘము, అది ఎత్తబడేవరకు ఆత్మలను చేకూర్చుకుంటుంది. సంఘము భూమిపై ఉండే పరిమితకాలము ముందుగానే ఏర్పరచబడింది. సంఘము భూమిమీద దాదాపు 2000 సంవత్సరములు ఉంటుందని లేఖనములు తెలుపుచున్నవి. ఆ

సమయంలో ఆత్మల పంట సమకూర్చ బడవలెను. మత్తయి 9:37,38లో యేసుక్రీస్తు ప్రభువు వారు చెప్పినది ఇదే, "కోత విస్తారమేగాని పనివారుకొద్దిగా వున్నారు గనుక తన కోతకు పనివారిని పంపుమని కోత యజమానుని వేడుకొను మని తన శిష్యులతో చెప్పెను". ఏర్పరచబడిన చివరిఆత్మ సంఘములో చేరిన వెంటనే సంఘము ఎత్తబడుతుంది. ప్రభువు యొక్క కార్యనిర్వహ ణను తెలుపు పట్టి ఎంత అద్భుతంగా ఖచ్చితంగా ఉంది. పండుగలలో ఏవి సూచించబడినవో ఆ వివరాలు నిజ జీవితములో ఏ పొరపాటులేక వాస్తవముగా నెరవేర్చబడుతున్నాయి. దేవుడు మాత్రమే అట్టి కార్యాలు చెప్పగలడు, చేయగలడు.

గత నాలుగు పండుగలు, పస్కాపండుగ, పులియని రొట్టెల పండుగ, ప్రథమ ఫలముల పండుగ మరియు పెంతెకొస్తు పండుగలు గత కాలములో జరిగి పోయిన సంఘటనలకు సాదృశ్యము. అవి నెరవేర్చబడినవి. క్రీస్తు మన పాపముల కొరకై మృతిపొందుట, నూతన జీవిత ప్రారంభము, మనయొక్క పునరుత్థానమునకు నిరీక్షణ నిచ్చిన యేసుక్రీస్తు పునరుత్థానము, పరిశుద్ధాత్మ శక్తి ద్వారా క్రీస్తు సంఘము ఏర్పరచుటయను విషయ ములను ఈ పండుగలు చూపించాయి. సంవత్సరము యొక్క మొదటి మూడు నెలలలో ఈ నాలుగు పండుగలు చోటుచేసు కుంటాయి. తరువాత మూడునెలల వ్యవధి ఉంటుంది. ఏడవ నెలయొక్క మొదటి దినమున బూరల పండుగ జరుగుతుంది. ఈ మూడు నెలల వ్యవధి పంటను సమ కూర్చుకొనుటకై నియమింపబడినది.

**5. బూరల పండుగ :**


ఇశ్రాయేలీయులు తమ వాగ్దాన దేశానికి ప్రయాణిం చుచున్నప్పుడు రెండు వెండి బూరలను ఉపయోగించారు. ప్రజలను పిలిచి సమకూర్చుటకు, వారికి ఆజ్ఞనిచ్చుటకు అవి ఉపయోగపడినవి. మందిరము చుట్టు దాదాపు నలభై లక్షల ప్రజలు తమ గుడారములలో బస చేయవలసి ఉండింది. సమాజమంతటికి ఏ సూచనలు ఇవ్వాలన్నా ఆ బూరలను ఉపయోగించాలి. ఆ బూరలను చేయవలెనని దేవుడు మోషేకు ఆజ్ఞాపించాడు. "యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను- నీవు రెండు వెండి బూరలను చేయించుకొనుము నకిషిపనిగా వాటిని చేయింపవలెను. అవి సమాజమును పిలుచుటకును, సేనలను తర్లించుటకును నీకుండవలెను" (సంఖ్యా 10:1,2).

మన ఆత్మీయ అవగాహనలో ఈ పండుగ అన్వయించు కోవాలంటే మనము పౌలు చెప్పింది తెలుసుకోవాలి. 1 థెస్స 4:16-17లో పౌలు ఈ విధంగా వివరించాడు: "ఆర్భాటము తోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు, ఆ మీదట సజీవులమై నిలచియుండు మనము వారితోకూడా ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము". పెంతెకొస్తు పండుగ ప్రకారము సంఘము స్థాపించబడిన తరువాత బూరల పండుగ ప్రకారము సంఘము ఎత్తబడవలసి ఉంది. సంఘము 2000 సంవత్సరాల క్రితము ప్రారంభమైంది, బూర శబ్దము వినిపించగానే అది మధ్యా కాశానికి వెళ్ళిపోతుంది. మనము పెంతెకొస్తు పండుగ మరియు బూరల పండుగల మధ్యకాలములో నివసిస్తున్నాము. ఈ సంఘము యొక్క 2000 సంవత్సరాల చరిత్రకాలంలో మన తరము చిట్టచివరిది. విశ్వాసులకు బూరల పండుగ, అనగా ఎత్తబడే పండుగ ఇప్పుడు ఏ సమయంలోనైనారావచ్చు.

**(సశేషం)**

**ఇంటర్‌నెట్‌లో తెలుగు బైబిలు కొరకు దర్శించండి :**
**www.onlinetelugubible.net**

# పునరుత్థానము




యేసు తన శిష్యులు కొందరికి ప్రత్యక్షమయ్యాడు... ఇదిగో ఆ దినమందే వారిలో ఇద్దరు యెరూషలేమునకు ఆమడ దూరమున ఉన్న ఎమ్మాయి అను ఒక గ్రామమునకు వెళ్ళుచు జరిగిన ఈ సంగతులన్నిటిని గూర్చి ఒకరితో నొకరు సంభాషించుచుండిరి. వారు సంభాషించుచు ఆలోచించుచుండగా యేసు తానే దగ్గరకు వచ్చి వారితో కూడ నడిచెను. అయితే వారాయను గుర్తుపట్టలేకుండా వారి కన్నులు మూయబడెను. ఆయన మీరు నడచుచు ఒకరితోనొకరు చెప్పుకున్న ఈ మాటలేమని అడుగగా వారు దుఃఖముఖులై నిలిచిరి. వారిలో క్లెయొపా అనువాడు యెరూషలేములో బసచేయుచుండి ఈ దినములలో అక్కడ జరిగిన సంగతులు నీవొక్కడివే ఎరుగవా? అని అడిగెను. ఆయన అవి ఏవని వారిని అడిగినప్పుడు వారు నజరేయు డైన యేసును గూర్చిన సంగతులే. ఆయన దేవుని ఎదుటను, ప్రజలందరి ఎదుటను క్రియలోను, వాక్యములోను, శక్తిగల ప్రవక్తయైయుండెను. మన ప్రధానయాజకులును అధికారు లను ఆయననూ, ఎలాగు మరణశిక్షకు అప్పగించి సిలువ వేయించిరో నీకు తెలియదా? ఇశ్రాయేలును విమోచింప బోవువాడు ఈయనే అని మేము నిరీక్షించియుంటిమి. అయితే మాలో కొందరు స్త్రీలు తెల్లవారుగానే సమాధి యొద్దకు వెళ్ళి ఆయన దేహమును కానక వచ్చి కొందరు దేవదూతలు తమకు కనబడి ఆయన బ్రతికియున్నాడని చెప్పిరి. మాతో కూడ ఉన్నవారిలో కొందరు సమాధియొద్దకు వెళ్ళి ఆ స్త్రీలు చెప్పినట్టు కనుగొనిరి గాని ఆయనను చూడ లేదని ఆయనతో చెప్పిరి. లూకా 24:13-24.

యేసు వారితో ఉన్నప్పటికీ వారు ఆయనను గుర్తుపట్ట లేదు. ఎందుకు గుర్తించలేదో బైబిలు చెప్పడంలేదు. మనం కేవలం ఊహించుకోవాలి. అప్పుడు యేసు తన గురించి పాత నిబంధన ప్రవచనాలను చెబుతూ వారికి నేర్పించాడు.

అందుకాయన అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాట లన్ని నమ్మని మందమతులారా, క్రీస్తు ఈలాగు శ్రమపడి తమ మహిమలో ప్రవేశించుట అగత్యం కాదా అని వారితో చెప్పి మోషేయు సమస్త ప్రవక్తలను మొదలు కొని లేఖనము లన్నిటిలో తన్ను గూర్చిన వచనముల భావము వారికి తెలిపెను. లూకా 24:25-27.

ఆ తరువాత కూడ తమతో మాట్లాడుతున్నది యేసే నని వారు గుర్తించలేదు. ఇంతలో తాము వెళ్ళుచున్న గ్రామము దగ్గరకు వచ్చినపుడు ఆయన ఇంక కొంత దూరము వెళ్ళునట్లు అగపడగా వారు సాయంకాలము కావచ్చింది ప్రొద్దుగ్రుంగినది మాతోకూడ ఉండుమని చెప్పి ఆయనను బలవంతము చేసిరి గనుక ఆయన వారితో కూడ ఉండుటకు లోపలికి వెళ్ళెను. ఆయన వారితో కూడ భోజనమునకు కుర్చునప్పుడు ఒకరొట్టెను పట్టుకొని స్తోత్రముచేసి దానిని విరిచి పంచి పెట్టగా వారి కన్నులు తెరవబడి ఆయనను గుర్తుపట్టిరి. అంతట ఆయన వారికి అదృశ్యుడాయెను. ఇప్పుడు వారు ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు భోదించుచున్నప్పుడు మన హృదయం మనలో మండుచుండలేదా అని ఒకనితో ఒకడు చెప్పుకొనిరి. లూకా 24:32.

అంతకు ముందు చాలాసార్లు వారు కలసి కూర్చొని యేసు రొట్టె విరవడం చూశారు. ఇప్పుడు ఆయన మళ్ళీ రొట్టె విరవడం చూచి ఆయన యేసు అని గుర్తించారు. ఆ తరువాత శిష్యులంతా కలిసి ఉన్నప్పుడు యేసు మరలా వారికి కనిపించాడు.

త్రోవలో జరిగిన సంగతులను ఆయన రొట్టె విరచడం వలననే తమకు ఎలాగు తెలియబడునో అదియు తెలియ జేసిరి. వారు ఈలాగు మాటలాడుచుండగా ఆయన వారి మధ్యను నిలిచి, మీకు సమాధానమవుగాకని వారితో

అనెను. అయితే వారు దిగులుపడి భయక్రాంతులై భూతము తమకు కనపడెనని తలంచిరి. అప్పుడాయన మీరెందుకు కలవరపడున్నారు? మీ హృదయములలో సందేహము పుట్టనేల? నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి నన్ను పట్టి చూడుడి. నాకున్నట్టుగా మీరు చూచుచున్న ఎముకలను మాంస మును భూతమున కుండునా అని చెప్పి తన చేతులను పాదములను వారికి చూపెను. అయితే వారు సంతోషము చేత ఇంకను నమ్మక ఆశ్చర్యపడుచుండగా ఆయన ఇక్కడ మీవద్ద ఆహారము కలదా అని వారినడిగెను. వారు కాల్చిన చేపముక్కను ఆయన కిచ్చిరి. ఆయన దానిని తీసుకొని వారి యెదుట భుజించెను. అంత ఆయన మోషే ధర్మశాస్త్రము లోను, ప్రవక్తల గ్రంథములలోను కీర్తనలలోను నన్ను గూర్చి వ్రాయబడినన్నియు నెరవేరవలెనని, నేను మీ యొద్ద ఉండినపుడు మీతో చెప్పిన మాటలు నెరవేరినవని వారితో చెప్పెను. లూకా 24:35-44.

ఇది యేసు ఇచ్చిన ఆజ్ఞ. ఇది ఆనాటి మొదటి శిష్యులకొరకే కాదు. ఆయనపై నమ్మకముంచి తమకోసం చేసిన పరిహారాన్ని అంగీకరించిన వారందరికీ,

"అప్పుడు వారు లేఖనములు గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరచి. క్రీస్తుశ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనులలో ఆయనపేరట మారు మనస్సును, పాపక్షమాపనయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఆ సంగతులకు మీరే సాక్షులు" లూకా 24:45-48. యేసు మనుష్యులందరి కోసమూ చని పోయాడు. అందువలన తాము సాతాను నుండీ, పాపమర ణాల నుండి తమకు విడుదల ఉందని మనుష్యులందరు తెలుసుకోవాలి దేవుడు కోరుతున్నాడు. శాశ్విత శిక్ష ఎవరూ పొందకూడదని దేవుని కోరిక.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను యోహాను 3:16.

అందుకే మనం బైబిలును కలిసి చదువుతున్నాము. ఈ అద్భుతమైన శుభవార్తను విని అర్ధం చేసుకొని నమ్మి ఇతరులకు కూడ చెప్పగలగాలి. నీకు, నాకు ఇదే దేవుని సందేశం. యేసుక్రీస్తులో మనం ఆయనకు అంగీకారమ య్యేలా ఆయనతో శాశ్వితకాలం జీవించేలా ఆయన మనకోసం చేసినదాన్ని మనం నమ్మాలని ఆయనకోరు తున్నాడు. నేను నా కళ్ళతో యేసును చూడలేదు. కాని యేసు ఈ లోకానికి వచ్చాడనీ నా పాపాలకోసం చనిపోయి 3వరోజున తిరిగి బ్రతికాడని నేను నమ్ముతున్నాను. నేను నిస్సహాయుడైన పాపినని దేవుడు చెప్పిన దానిని నేను ఒప్పుకుంటున్నాను. యేసులో నమ్మకముంచాను. తన మరణం ద్వారా ఆయన నాకోసం చెల్లించినది దేవుడు నన్ను అంగీకరించడానికి ఏకైక మార్గం.

దేవుడు తన వాక్యంలో రాసిన దానిని నీవు ఒప్పు కుంటే, యేసులో ఆయన నీ పాపాలకు పరిహారం చెల్లిం చడంలో నమ్మకం ఉంచితే దేవుడు నీ పాపాన్ని అంతటిని క్షమిస్తాడు. నిన్ను అంగీకరించి నిత్యజీవితమనే వరాన్ని ఇస్తాడు. ప్రతి వ్యక్తి దగ్గరికి ఈ సువార్తను తీసుకు వెళ్ళమని యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించిన తరువాత ఆయన వారిని విడిచి పరలోకంలో తన తండ్రి దగ్గరకు వెళ్ళిపోయాడు.

ఈ మాటలు చెప్పి వారు చూచుచుండగా ఆయన ఆరోహణమాయెను. అప్పుడు వాని కన్నులకు కనబడకుండ ఒక మేఘము ఆయనను కొనిపోయెను అపో.కా. 1:9.

నీవు ఆరోహణమైతివి పట్టబడిన వారిని చెరపట్టుకొని పోతివి. కీర్తనలు 68:18.

యేసు పరలోకానికి తిరిగి వెళతాడని దావీదు తన ప్రవచనంలో చెప్పాడు. దేవుని వాక్యంలో నెరవేరిన మరొక ప్రవచనం ఇది. "ఆయన వెళ్ళుచుండగా, వారు ఆకాశము వైపు తేరి చూచుచుండిరి. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన ఇద్దరు మనుష్యులు వారి యొద్దనిలిచి... అపో.కా. 1:10.

ఈ ఇద్దరు దేవుని దూతలు. ఇదిగో తెల్లని వస్త్రములు ధరించుకొనిన ఇద్దరు మనుష్యులు వారియొద్ద నిలిచి గలిలయ మనుష్యులారా మీరెందుకు నిలిచి ఆకాశము వైపు చూచుచున్నారు? మీ యొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసు ఏ రీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి. అపో.కా. 1:11.

యేసు తిరిగి ఈలోకానికి రానున్నాడు. ఈసారి వచ్చినపుడు లోకమంతటికి, తీర్పు తీర్చే బలిష్ఠుడైన మహా న్యాయాధిపతిగా ఆయన వస్తాడు. ఆయన్ను సిలువ వేయకముందు యూదుల నాయకులకు ఆయన చెప్పింది ఇదే. “అయితే ఆయన ఉత్తరమేమియు చెప్పక ఊర కుండెను. తిరిగి ప్రధానయాజకుడు – పరమాత్ముని కుమారుడైన క్రీస్తువు నీవేనా? అని ఆయనను అడుగగా యేసు అవును నేనే మీరు మనుష్య కుమారుడు సర్వ శక్తిమంతుని కుడిపార్శ్వమున కూర్చుండటయు, ఆకాశ మేఘరూఢుడై వచ్చుటయు చూచెదరని చెప్పెను. మర్కు 14:61,62.

సర్వశక్తుడైన న్యాయమూర్తిగా యేసు తిరిగి వచ్చి నపుడు పశ్చాత్తాపపడి యేసునిపై నమ్మకముంచిన వారు పరలోకం వెళతారు. ఉంచనివారు, పశ్చాత్తాపం పొందని వారు నిత్యము ఉండే నరకంలో పడతారు.ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడి నట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయ బడెను. ప్రకటన 20:15. యేసు శిష్యులంతా యేసుపై నమ్మకముంచారు. పంపుతానని దేవుడు వాగ్దానం చేసిన రక్షకుడు ఆయనేనని వారికి తెలుసు ఆయన అద్భుతాలను వారు చూశారు. మరణించడం, తిరిగి జీవించడం, మేఘాల గుండా వెళ్ళిపోవడం చూశారు.

వ్యక్తిగతంగా వారు ఆయనను ఎరుగుదురు. వాగ్దానం ప్రకారం వచ్చిన రక్షకుడు ఆయనేనని వారికి ఖచ్చితంగా తెలుసు. ఆయన నిజంగా దేవుడు. శిష్యులు బయలుదేరి వెళ్ళి ఇతరులకు యేసును గురించి చెప్పారు. వారి సందేశాన్ని వేలకొలది నమ్ముకున్నారు.

వీరిలో చాలా మంది వెళ్ళి మరింతమందికి చెప్పారు. కాని కొందరు యేసును వ్యతిరేకించినట్టుగానే వారిని వ్యతి రేకించారు. యేసు యొక్క మొదటి 11 మంది శిష్యులు ఆయనలో తమ విశ్వాసం మూలంగా శిక్షపొంది చనిపో యారు. వారిలో కొందరిని చిత్ర వధ చేశారు. కొందరిని సిలువ వేశారు. ఒకడు చెరసాలలో చనిపోయాడు. ఒక అబద్ధం కోసం వీరు తమ ప్రాణాన్ని ఇస్తారా? లేదు తాము సత్యమని చూచి తెలిసికొన్న దానికోసం ప్రాణంపెట్టారు. దేవుని వాక్యంపై మన విశ్వాసాన్ని స్థిరంగా నిలుపుకోవచ్చు. ఎందుకంటే అది సత్యం.

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాస ముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. యోహాను 3:16.

దేవుడు మిమ్మును దీవించును గాక!

## పాఠకులకు శుభవార్త

**‘పరిశుద్ధత’** మాసపత్రిక ఇంటర్నెట్‌లో చదువుకొనే సౌకర్యము కల్పించామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము. వెబ్‌సైట్ పేరు **www.holinessmagazine.com.** ప్రస్తుతము మీరు 2014 సంచికలన్నీ డౌన్‌లోడ్ చేసు కొనవచ్చును. త్వరలో పాత సంచికలన్నీ ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనే సౌకర్యం కల్పించటానికి ప్రయత్నిస్తాము. అంతేకాక శ్రీమతి మాధురి మరియన్‌గారు పాడిన **‘పరిశుద్ధ గీతములు’ (Holi Melodies)** ఎనిమిది సి.డి.ల పాటలు మరియు **క్రిస్మస్ పాటలు** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. మీరు ఈ పాటలను వినవచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. త్వరలో **‘పరిశుద్ధ ప్రవాహిని’** టి.వి. కార్యక్రమములో ప్రసారమయ్యే ప్రసంగాల వీడియోలను కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తేవాలన్న ఆలోచన ఉంది. ప్రార్థించండి. విదేశాలలో ఉన్న మీ బంధువులకు, స్నేహితులుకు తెలియజేయండి. దేవుడు మిమ్ములను దీవించును గాక!

**– ఎడిటర్**

# పరిశుద్ధ గ్రంథమునందలి దంపతుల పేర్లు



శ్రీమతి రిబ్కా విక్రాంత్

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున వందనములు. ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమునందలి దంపతుల గూర్చి నేర్చుకుందాము.

1. **ఆదాము మరియు హవ్వ** – భూలోకముయొక్క మొట్టమొదటి దంపతులు. ఆదికాండము 3:20,

2. **అబ్రహాము మరియు శారయి** – ఇశ్రాయేలీయుల తల్లిదండ్రులు ఆదికాండము 11:29

3. **ఇస్సాకు మరియు రిబ్కా** – అబ్రహాము యొక్క కుమారుడు మరియు కోడలు. ఆదికాండము 24:67.

4. **యాకోబు మరియు రాహేలు** – ఇశ్రాయేలీయుల యొక్క 12 గోత్రములకు తండ్రి మరియు అతని ప్రియమైన భార్య. ఆదికాండము 29:18.

5. **యోసేపు మరియు ఆసెనతు** – యాకోబు ప్రేమించిన కుమారుడు మరియు ఐగుప్తీయురాలైన యోసేపు భార్య ఆదికాండము 4:45.

6. **అమ్రాము మరియు యోకెబెదు** – మోషే తల్లిదండ్రులు. నిర్గమకాండము 2:1,2; 6:20.

7. **మోషే మరియు సిప్పోరా** – ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రమును ఇచ్చినవాడు మరియు మిద్యానీయురాలైన అతని భార్య. నిర్గమకాండము 2:21.

8. **ఎలీమెలెకు మరియు నయోమి** – రూతు యొక్క అత్తమామలు రూతు 1:2.

9. **బోయజు మరియు రూతు** – రాజైన దావీదు యొక్క పితరులు. రూతు 4:13.

10. **ఎల్కానా మరియు హన్నా** – సమూయేలు యొక్క తల్లిదండ్రులు. 1 సమూయేలు 1:1,2.

11. **సౌలు మరియు అహీనోయము** – ఇశ్రాయేలీయుల యొక్క మొట్ట మొదటి రాజు అతని భార్య. 1 సమూయేలు 14:50.

12. **నాబాలు మరియు అబీగయీలు** – బుద్ధిహీనుడైన ధనవంతుడు మరియు అతని జ్ఞానముగల భార్య. 1సమూయేలు 25:3.

13. **దావీదు మరియు బత్షెబ** – సొలొమోను తల్లిదండ్రులు. 2సమూయేలు 11:27.

14. **రెహబాము మరియు మయకా**–సొలొమోను కుమారుడైన ఇతడు విగ్రహారాధికురాలైన తన భార్యతో కలసి యూదా రాజ్యమును పరిపాలించెను. 2దిన. 11:20; 1రాజులు 15:13.

15. **అహబు మరియు యెజెబెలు** – వీరు దుష్టరాజ దంపతులు. 1రాజులు 16:30,31.

16. **యెహోరాము మరియు అతల్యా** – యెహోషాపాతు కుమారుడైన ఇతడు యెజెబెలు కుమార్తెను వివాహము చేసుకొనెను. 2రాజులు 8:16–26.

17. **యెహోయాదా మరియు యెహోషబతు**–ఇతడు దేవుని ప్రధానయాజకుడు, ఇతని భార్యయైన యెహోషబతు అహజ్యా కుమారుడైన యోవాషును రక్షించినది. 2దిన. 2:11.

18. **హోషేయ మరియు గోమెరు** – దేవుని ప్రవక్త మరియు వేశ్యయైన అతని భార్య. హోషేయ 1–3.

19. **అహష్వేరోషు మరియు ఎస్తేరు** – పర్షియారాజు మరియు యూదురాలైన అతని రాణి. ఎస్తేరు 2:16.

20. **హామాను మరియు జెరెషు** – దుష్టుడైన పర్షియా రాజకీయ నాయకుడు మరియు అతని భార్య. ఎస్తేరు 5:14; 6:13.

21. **జెకర్యా మరియు ఎలీసబెతు** – బాప్తిస్మమిచ్చు యోహాను తల్లిదండ్రులు. లూకా 1:5.

22. **యోసేపు మరియు మరియ** – ప్రభువైన యేసుకు చట్టబద్దముగా తండ్రి మరియు ప్రభువుకు తల్లి. లూకా 1:27.

23. **జెబెదయి మరియు సలోమి** – యాకోబు మరియు యోహానుల తల్లిదండ్రులు. మత్తయి 4:21; 27:56.

24. **కూజా మరియు యోహన్న** – ఇతడు అంతిపయ హేరోదు యొక్క గృహ నిర్వాహకుడు, వీరిరువురు ప్రభువైన యేసు భూసంబంధమైన పరిచర్యకు ఆర్థికముగా సహాయ పడిరి. లూకా 8:3.

25. **అంతిపయ హేరోదు మరియు హేరోదియ** – ఇతడు గలిలయ పాలకుడు. దుష్టురాలైన ఇతని (సోదరుని) భార్య బాప్తిస్మమిచ్చు యోహాను చంపబడుటకు కారకురాలు. మత్తయి 14:3.

26. **అననీయ మరియు సప్పీరా** – వీరు అపొస్తలులను మోసగించుటకు ప్రయత్నించి చనిపోయిరి. అపొ.కా. 5:1

27. **అకుల మరియు ప్రిస్కిల్ల** – దైవదంపతులైన వీరు అపొస్తలుడైన పౌలుకు ఎంతగానో సహాయపడిరి. అపొ.కా. 18:1,2.

28. **ఫేలిక్సు మరియు ద్రుసిల్ల** – ఇతడు కైసరయకు రోమా గవర్నరు, ఇతని భార్య యూదురాలు, వీరికి అపొస్తలుడైన పౌలు దేవుని వాక్యమును బోధించెను. అపొ.కా. 24:24.

29. **రెండవ అగ్రిప్ప మరియు బెర్నీకే** – ఇతడు హేరోదు ముని మనుమడు. వీరికి కూడ పౌలు వాక్యము బోధించెను. అపొ.కా. 25:13.

దేవుడు మిమ్మును తన కృపలో కాపాడి భద్రపరచును గాక! ఆమెన్!!



## పాఠకులకు విజ్ఞప్తి!

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ గత 20 సంవత్సరములు నుండి నడిపించగలగటం దేవుని కృప వలన మాత్రమే సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు మేము సంవత్సర చందా విషయంలో పాఠకుల మీద ఎలాంటి వత్తిడి తీసుకురాలేదు. చందా కట్టినా కట్టక పోయినా మేము పత్రిక ఆపలేదు. ఎందుకంటే ఈ మా సాహిత్య సేవలో మేము ఆత్మల రక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాము. అయితే పాఠకుల దగ్గర నుండి కొన్ని పత్రికలు వెనక్కు వస్తున్నాయి. కావున పాఠకులు దయచేసి వారి అడ్రసు మారిన యెడల మాకు తెలియజేయ వలసినదిగా కోరుచున్నాము.

పనుల వత్తిడి వల్లకాని, ఇతరత్రా కారణాలవల్ల కాని పత్రిక చదివే సమయం లేనట్లయితే, మీరు కోరిన వారికి ఆ పత్రికను పంపగలము లేదా పత్రిక అవసరం లేదని పోస్టుకార్డు ద్వారా కాని పత్రిక అడ్రసు మీద ఉండే సీరియల్ నంబరును ఎస్.యం.ఎస్. ద్వారా కాని (9440217726 నంబరుకు) తెలియజేయగలరు. ఈ సంచికతో పాటు లేదా వచ్చే సంచికతో పాటు వచ్చే పోస్టుకార్డును ఉపయోగించుకొని, మీకు పత్రిక అవసరమా?/అవసరము లేదా? లేక పత్రికను ఎవరికైనా పంపవలెనా? అను సమాచారము తెలియజేస్తూ పోస్టు కార్డును మాకు పంపినచో మేము మీ కోరిన విధముగా చేయగలము. కావున పాఠకులు మాతో సహకరించ వలసినగా ప్రభువు పేరట కోరుచున్నాము.

**-ఎడిటర్**

## బైబిల్ క్విజ్ - 7 జవాబులు

1. షెకెము
2. దోతాను
3. రూబేను
4. యూదా
5. ఇష్మాయేలీయులకు, ఇరువది తులముల వెండికి
6. పోతీఫరుకు
7. రాజ సంరక్షక సేనాధిపతి
8. తామారు
9. ఏరు, ఓనాను, షేలా
10. పానదాయకుడు, భక్ష్యకారుడు
11. పానదాయకుని
12. రెండు సంవత్సరముల
13. రెండు
14. ఆవులు, పధ్నాలుగు
15. వెన్నులు
16. దేశమంతటి మీద అధికారిగా నియమించెను
17. జప్నత్పనేహు
18. ఆసెనతు
19. పోతీఫెర
20. మనష్షే
21. ఎఫ్రాయీము
22. ఏడు సంవత్సరములు
23. ముప్పది సంవత్సరములు
24. ఓను
25. పదిమంది

**గత నెల విజేతలు :**

యం. హేమ, త్రిపురపురం, గుంటూరు జిల్లా

కె. విజయ సుశీల, తిరువూరు, కృష్ణా జిల్లా



# అక్షరయజ్ఞం



## పునరుత్థాన పండుగ స్పెషల్ క్విజ్

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. యేసు చివరి పస్కాను ఆచరించుచు రొట్టెను, ద్రాక్షారసమును దేనికి సాదృశ్యముగా చూపెను?
2. ఎవనిచేత మనుష్యకుమారుడు అప్పగింపబడుచున్నాడో, ఆ మనుష్యునికి శ్రమ, ఆ మనుష్యుడు పుట్టకుండినయెడల వానికి మేలు అని ఎవరిని గూర్చి యేసు పలికెను?
3. తాను అప్పగింపబడకముందు యేసు తన శిష్యులతో ఏ స్థలమునకు ప్రార్థన చేయ వెళ్ళెను?
4. నీవు నిద్రించుచున్నావా? ఒక్క గడియైనను మేలుకొనియుండలేవా? అని ఎవరితో ప్రభువు అన్నాడు?
5. కోడి ఎన్ని మారులు కూయకమునుపు నీవు నన్ను ఎరుగనని బొంకెదవని యేసు పేతురుతో పలికెను?
6. సీమోను పేతురు ఎవరి చెవిని తెగనరికెను?
7. మొదటిగా తీర్పునకై యేసును ఎవరి యొద్దకు తీసుకు పోయిరి?
8. నీవు ఆ నీతిమంతుని జోలికి పోవద్దు అని ఎవరు సందేశము పంపించారు?
9. పిలాతు ఎవరిని సంతోషపెట్టుటకు యేసును కొరడాలతో కొట్టించి సిలువవేయ నప్పగించెను?
10. యేసుకు బదులుగా ఎవరిని విడుదలచేసి యేసును సిలువవేయుటకు అప్పగించెను?
11. గొల్గోతా అనగా అర్థమేమి?
12. యేసుకు బదులుగా సిలువను మోయుటకు ఎవరిని బలవంతము చేసిరి?
13. దేనిని కలిపిన ద్రాక్షారసమును యేసుకియ్యగా ఆయన దానిని పుచ్చుకొనలేదు?
14. "అమ్మా, ఇదిగో నీ కుమారుడు" అని యేసు క్రీస్తు ఎవరిని గూర్చి తన తల్లితో చెప్పెను?
15. ఏలీ ఏలీ లామా సబక్తానీ అనగా అర్థమేమి?
16. మధ్యాహ్నము మొదలుకొని ఎన్ని గంటలు వరకు ఆ దేశమంతయు చీకటి కమ్మెను?
17. యేసు దేహాన్నీ తనకిమ్మని తెగించి పిలాతునొద్దకు వెళ్ళి అడిగింది ఎవరు?
18. విశ్రాంతి దినము గడిచి తెల్లవారుచుండగా ఎవరు సమాధిని చూడవచ్చిరి?
19. యేసు లేచియున్నాడు, ఇక్కడ లేడు, ఆయన ఎచటికి వెళ్ళుచున్నాడని దూత ఆ స్త్రీలతో చెప్పెను?
20. పునరుత్థానుడైన యేసు ఏ మార్గమున ఇద్దరు మనుష్యులను దర్శించాడు?
21. పునరుత్థానుడైన యేసు 11 మంది శిష్యులు భోజనమునకు కూర్చున్నప్పుడు వారికి ప్రత్యక్షమై ఎందునిమిత్తము వారిని గద్దించెను?
22. 'నీవు చూచి నమ్మితివి, చూడక నమ్మినవారు ధన్యులని" ఎవరితో యేసు పలికెను?
23. ఏమి గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరిచాడు?
24. యేసు తన శిష్యులను ఎచటవరకు తీసుకుపోయి వారిని ఆశీర్వదిస్తుండగా పరలోకమునకు ఆరోహణమయ్యాడు?
25. మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి అని యేసు ఎవరికి ఆజ్ఞాపించెను?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.